# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 15-12-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 108 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోడీ భేటీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 14:ప్రధాని నరేంద్ర మోడీ ఉత్తర ప్రదేశ్ లో రెండోరోజు పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ ఇవాళ బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో భేటీ అయ్యారు.

ప్రధాని మోడీ అధ్యక్షతన సుపరిపాలనపై సెమినార్ నిర్వహించారు. ఆయా రాష్ట్రాల్లో కోవిడ్ పరిస్థితులు, సమస్యలపై ప్రధాని ముఖ్యమంత్రులతో చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ సహా మరిన్ని అంశాలపై బీజేపీ సీఎంలతో ప్రధాని మోడీ చర్చించారు. యూపీ సహా పలు రాష్ట్రాల్లో వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకొంది.

ఇదిలా ఉండగా.. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వారణాసిలో రూ.339 కోట్ల వ్యయంతో పూర్తిచేసిన కాశీ విశ్వనాథ్ ధామ్ మొదటి దశను ప్రారంభించిన విషయం విదితమే. ఈ గంగానదిపై ఉన్న రెండు ఘాట్ లతో పురాతన కాశీ విశ్వనాథ ఆలయాన్నిఈ కారిడార్ కలపనుంది.

## తమిళనాడు సీఎం స్టాలిన్‌తో సీఎం కేసీఆర్ భేటీ



హైదరాబాద్, డిసెంబర్ 14:తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తమిళనాడు పర్యటనలో ఉన్నారు. ఆయన తమిళనాడు సీఎం స్టాలిన్‌తో భేటీ అయ్యారు. తమిళనాడు సీఎం స్టాలిన్ నివాసంలో సమావేశమయ్యారు. యాదాద్రి ఆలయ ప్రారంభోత్సవానికి స్టాలిన్‌ను సీఎం కేసీఆర్ ఆహ్వానించనున్నారు.

ఈ భేటీలో జాతీయ రాజకీయపరమైన అంశాలు, పాలనాపరమైన విషయాలపై ఇరువురు ముఖ్యమంత్రులు చర్చించనున్నారు. ప్రస్తుత పరిస్థితులపై చర్చించి భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన అంశాలపై ఇరువురు ముఖ్యమంత్రులు చర్చించే అవకాశం ఉంది. చెన్నైలోనే ఉన్న రాష్ట్ర మాజీ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్?ను కూడా కేసీఆర్ కలవనున్నట్లు సమాచారం.

## దేశంలో మరో ఎనిమిది మందికి ఒమిక్రాన్ పాజిటివ్.. 49కి పెరిగిన కేసులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: భారత్‌లో ఒమిక్రాన్ వేగంగా వ్యాప్తి చెందుతున్నది. ఇవాళ ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల్లో నాలుగు చొప్పున ఎనిమిది కొత్త కేసులు నమోదయ్యాయి. దీంతో కొత్త స్ట్రెయిన్ కేసుల సంఖ్య 49కి చేరింది. ఇప్పటి వరకు మహారాష్ట్రలో 20, రాజస్థాన్‌లో 13, కర్ణాటకలో మూడు, గుజరాత్‌లో నాలుగు, కేరళ ఒకటి, ఆంధ్రప్రదేశ్ ఒకటి, ఢిల్లీలో ఆరు, చండీగఢ్‌లో ఒకటి చొప్పున కేసులు నమోదయ్యాయి. మరో వైపు కొవిడ్ సంబంధిత ప్రోటోకాల్స్‌ను పాటించడంలో నిర్లక్ష్యంపై ప్రభుత్వం హెచ్చరించింది. అలాగే త్వరగా కొవిడ్ టీకా తీసుకోవాలని సూచించింది. ఇదిలా ఉండగా.. ఢిల్లీలో నాలుగు ఒమిక్రాన్ పాజిటివ్ కేసులు నమోదైనట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యేంద్ర జైన్ తెలిపారు. ఒమిక్రాన్ బారినపడ్డ ఓ వ్యక్తి కోలుకొని డిశ్చార్జి అయ్యారని చెప్పారు.

## కాశీ రూపురేఖలను మార్చేశాం : ప్రధాని మోది

వారణాసి, డిసెంబర్ 14:: కాశీ ముఖచిత్రాన్ని ప్రభుత్వం మార్చివేసిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కాశీ ప్రతిష్ట, శక్తి నలుదిశలా విస్తరిస్తోందని అన్నారు. ప్రధాని మోదీ మంగళవారం సద్గురు సదఫల్‌దేవ్ విహంగమ్ యోగ్ సంస్థాన్ 98వ వార్షిక వేడుకల్లో పాల్గొని సద్గురు సదఫల్‌దేవ్‌కు నివాళులు అర్పించారు. అనంతరం మెగా వారణాసి ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు.

విశ్వనాథ్ ధామ్‌ను కాశీ నగరం ఆ మహదేవుడికి అంకితం చేసిందని కాశీ విశ్వనాథ కారిడార్ ప్రారంభోత్సవాన్ని ప్రస్తావిస్తూ పేర్కొన్నారు. ఇక స్వాతంత్ర్య పోరాటంలో సన్యాసుల పాత్రను చరిత్ర ప్రస్తావించలేదని విస్మయం వ్యక్తం చేశారు. భారత స్వాతంత్ర్య సమరంలో సద్గురు సదఫల్‌దేవ్‌తో పాటు ఎందరో సన్యాసులు పాల్గొన్నా వారి సేవలను ప్రస్తుతించాల్సిన స్థాయిలో చరిత్రలో పొందుపరచలేదని అన్నారు. అంతకుముందు వారణాసిలో తన రెండో రోజు పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ కాశీ విశ్వనాథ్ ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం బీజేపీ ముఖ్యమంత్రులతో సుపరిపాలనపై ప్రధాని మోదీ సమాలోచనలు సాగించారు.

## స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఘన విజయం



హైదరాబాద్, డిసెంబర్ 14: తెలంగాణ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార టీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించింది. మొత్తం 12 ఎమ్మెల్సీ స్థానాలను టీఆర్ఎస్ పార్టీనే కైవసం చేసుకుంది. విపక్షాలు కనీసం పోటీ ఇవ్వలేకపోయాయి. 12 స్థానాల్లో 6 స్థానాలు ఏకగ్రీవం కాగా, మరో 6 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఆరు స్థానాల్లోనూ టీఆర్ఎస్ అభ్యర్థులే గెలుపొందారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి టీఆర్ఎస్ అభ్యర్థులు భానుప్రసాద్ రావు, ఎల్ రమణ, ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి వంటేరు యాదవరెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి తాతా మధు, ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఎం కోటిరెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి దండె విఠల్ గెలుపొందారు. ఏకగ్రీవంగా ఎన్నికైన టీఆర్ఎస్ అభ్యర్థులు.. ఉమ్మడి నిజామాబాద్ నుంచి కల్వకుంట్ల కవిత, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి పట్నం మహేందర్‌రెడ్డి, శంభీపూర్ రాజు, వరంగల్ నుంచి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ నుంచి కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భానుప్రసాద్ రావుకు 584 ఓట్లు రాగా, ఎల్ రమణకు 479 ఓట్లు వచ్చాయి. మొత్తం 1320 ఓట్లు పోల్ కాగా, 1303 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. 17 ఓట్లు చెల్లుబాటు కాలేదు.

ఉమ్మడి మెదక్ జిల్లా టీఆర్ఎస్ అభ్యర్థి యాదవరెడ్డికి 762 ఓట్ల వచ్చాయి.

సమీప ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ అభ్యర్థికి 238 ఓట్లే పోలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థికి కేవలం ఆరు ఓట్లే వచ్చాయి. మెదక్ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 12 ఓట్లు చెల్లనివిగా తేలాయి.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 1271 ఓట్లకుగానూ 1233 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 50 ఓట్లు చెల్లనివని అధికారులు తేల్చారు. టీఆర్ఎస్ అభ్యర్థి ఎం కోటిరెడ్డికి ఏకంగా 917 ఓట్లు వచ్చాయి. ఆయనపై పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి నగేష్‌కు 226 ఓట్లు వచ్చాయి. మొత్తం 691 ఓట్ల మెజార్టీతో కోటిరెడ్డి విజయం సాధించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టీఆర్ఎస్ అభ్యర్థి తాతా మధు గెలుపొందారు. టీఆర్ఎస్ అభ్యర్థికి 480 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థికి 242 ఓట్లు వచ్చాయి. తన సమీప ప్రత్యర్థిపై తాతా మధు 238 ఓట్ల మెజార్టీతో మధు గెలుపొందారు. ఖమ్మం ఎమ్మెల్సీ స్థానంలో 12 చెల్లని ఓట్లు ఉన్నాయి. స్వతంత్ర అభ్యర్థికి కేవలం 4 ఓట్లే వచ్చాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి ఘన విజయం సాధించారు. ఇక్కడ మొత్తం 862 ఓట్లు పోలవగా.. టీఆర్ఎస్ అభ్యర్థి దండె విఠల్‌కు మొత్తం 740 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి, స్వతంత్ర అభ్యర్థి పుష్కరానికి కేవలం 74 ఓట్లు మాత్రమే వచ్చాయి. మొత్తం 666 ఓట్ల మెజార్టీతో విఠల్ విజయం సాధించారు. ఆదిలాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం చెల్లని ఓట్లు 48 నమోదయ్యాయి.

## ఎల్బీ స్టేడియంలో క్రిస్మస్ వేడుకలు : మంత్రి కొప్పుల ఈశ్వర్



హైదరాబాద్, డిసెంబర్ 14: ఈ నెల 21 లేదా 22వ తేదీల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియం వేదికగా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తామని మంత్రి కొప్పుల ఈశ్వర్ వెల్లడించారు.

ఈ వేడుకలకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యే అవకాశం ఉందన్నారు. క్రిస్మస్ వేడుకల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులతో మంత్రులు కొప్పుల ఈశ్వర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, మల్లారెడ్డి సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని మతాలకు సంబంధించిన పండగులను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. గతేడాది కరోనా కారణంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించలేకపోయామని చెప్పారు. ఈ ఏడాది క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. క్రిస్టియన్ సమాజంలో ఉన్న నిరుపేదలకు రూ. 11 కోట్ల 50 లక్షలు ఖర్చు పెట్టి నూతన వస్త్రాలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీలోపు రెండున్నర లక్షల మందికి నూతన వస్త్రాల పంపిణీ జరుగుతుందన్నారు.

## జమీందారీ లక్షణాలను పక్కనపెట్టండి: కాంగ్రెస్‌కు చురకలంటించిన దీదీ

బెంగాల్ , డిసెంబర్ 14: బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత మమతా బెనర్జీ కాంగ్రెస్‌పై తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. గోవాలో తమతో పొత్తు పెట్టుకోవాలని భావిస్తే, ఆ పార్టీ ముందుకు రావొచ్చని మమత ప్రకటించారు. అయితే జమీందారీ లక్షణాలను మాత్రం పక్కన పెట్టాలని చురకలంటించారు. గోవా పర్యటనలో భాగంగా మమతా బెనర్జీ పార్టీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్‌ను తానేమీ విమర్శించను అని అంటూనే కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. బీజేపీని ఓడించడానికి కాంగ్రెస్ విశేషమైన పనులు చేస్తున్నట్లు ఏమీ కనిపించడం లేదనిపెదవి విరిచారు. అయితే బీజేపీని ఓడించడానికి కాంగ్రెస్ ఏదైనా పనికి పూనుకుంటే మాత్రం తమకు వచ్చిన అభ్యంతరమేమీ లేదని ఆమె స్పష్టం చేశారు.

మహరాష్ట్రవాదీ గోమంతక్ పార్టీతో తమ పొత్తు ఖాయమైందని మమత ప్రకటించారు. తమతో పొత్తు పెట్టుకోడానికి కాంగ్రెస్ ముందుకు రాకుంటే, ఇక ఏ పార్టీ ముందుకు రాదన్న భ్రమలో కాంగ్రెస్ ఉ ఒడిపోయిందని, కానీ ఎంజీపీ ముందుకు వచ్చిందని ఆమె తెలిపారు. ఈ ఆలోచనా విధానం నుంచి కాంగ్రెస్ బయటపడితే బాగుంటుందని సూచించారు. తమ పార్టీ హిందువులకు వ్యతిరేకమని బీజేపీ ప్రచారం చేస్తోందని, అది శుద్ధతప్పు అని మమత స్పష్టం చేశారు.

## యువతలో నైతికత, దేశభక్తిని సినిమాలు పెంపొందించాలి: వెంకయ్యనాయుడు



న్యూఢిల్లీ, డిసెంబర్ 14: సినిమా రంగం లక్ష్యం వినోదం మాత్రమే కారాదని, యువతలో నీతి, నైతికవర్తన, దేశభక్తి, మానవత్వాన్ని పెంపొందించేలా సినిమాలు తీయాలని చిత్ర నిర్మాతలకు ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు.

ఓ ఉన్నత లక్ష్యంతో సినిమాలు నిర్మించడం ద్వారా యువతను చైతన్యవంతం చేయాలని ఉద్బోధించారు. సినిమా ద్వారా కులతత్వం, అవినీతి, లింగ వివక్ష, సామాజిక వివక్ష వంటి దురాచారాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రసిద్ధ దర్శకుడు రాహుల్ రావైల్ రచించిన 'రాజ్ కపూర్–ది మాస్టర్ ఎట్ వర్క్' పుస్తకాన్ని మంగళవారం న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు ప్రసంగించారు.

భారతీయ చిత్రాలను ప్రపంచవ్యాప్తంగా వీక్షిస్తున్నారని పేర్కొన్న ఉపరాష్ట్రపతి.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులను సినిమా తమ మూలాలతో కలుపుతున్నదని, ఈ దిశగా సాంస్కృతిక వారధిని నిర్మిస్తున్నదని తెలిపారు. హిందీ చిత్ర సినిమా ఘనతను సగర్వంగా చాటిచెప్పిన రాజ్ కపూర్ జీవితానికి సంబంధించిన అద్భుతమైన జ్ఞాపకాలతో పుస్తకాన్ని తీసుకొచ్చిన రాహుల్ రావైల్, శ్రీమతి ప్రణికా శర్మ అభినందనీయులన్నారు. రాజ్ కపూర్ దూరదృష్టి గల మేధావి అని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని పేర్కొన్నారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమకు రాజ్ కపూర్ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. రాజ్ కపూర్ తన చిత్రాల ద్వారా భారతీయ సినిమాను సాంస్కృతిక దౌత్యానికి వాహకంగా మారారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సినిమా నటుడు రణ్‌బీర్ కపూర్, కాలమిస్ట్ సుహేల్ సేథ్, బ్లూమ్స్ బరీ ఇండియాకు చెందిన శ్రీమతి మీనాక్షి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## తొలిసారిగా దేశంలో బూస్టర్ డోస్‌పై అధ్యయనం.. సీఎంసీ వేలూరులో నిర్వహణ!

న్యూఢిల్లీ, డిసెంబర్ 14:: కొత్తగా పుట్టుకు వస్తున్న కరోనా కొత్త వేరియంట్లతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా బూస్టర్ డోస్‌పై చర్చ తీవ్రంగానే సాగుతున్నది. ఇప్పటికే పలు దేశాలు మూడో డోసు టీకా పంపిణీ చేస్తుండగా.. భారత్‌లో మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. బూస్టర్ డోస్‌పై శాస్త్రీయ ఆధారాలు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దేశంలోనే తొలిసారిగా వేలూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీలో బూస్టర్ డోస్‌పై క్లినికల్ స్టడీ ప్రారంభమైంది. ఇందు కోసం సంస్థ మూడు నుంచి ఆరు నెలల కిందట కొవాగ్జిన్ రెండు మోతాదుల టీకా తీసుకున్న వలంటీర్లు అవసరం. కాగా, ఇన్‌స్టిట్యూట్ కొవాగ్జిన్ తీసుకున్న వారు ఎక్కువగా అందుబాటులో లేకపోవడంతో అధ్యయనం ఆలస్యమవుతున్నది.

అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. భారత్‌లో కొవిడ్‌కు వ్యతిరేకంగా అందిస్తున్న వ్యాక్సిన్లలో 88శాతం వాటా కొవిషీల్డ్‌దే. అయితే, కొవాగ్జిన్ టీకా తీసుకున్న వారి సంఖ్య తక్కువగా ఉన్నది. ఇలాంటి పరిస్థితుల్లో అధ్యయనం కోసం వలంటీర్ల ఎంపికకు ఇబ్బందులెదురవుతున్నాయి. ఈ క్రమంలో ఇన్‌స్టిట్యూట్ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ.. కొవాగ్జిన్ తీసుకున్న వ్యక్తుల కోసం ఆరా తీస్తున్నరు. క్లినికల్ ట్రయల్స్ కోసం వలంటీర్లు అవసరమంటూ సోషల్ మీడియాలో పేర్కొంది. మూడు నుంచి ఆరు నెలల కిందట రెండో డోసు కొవాగ్జిన్ టీకా తీసుకున్న వ్యక్తుల బూస్టర్ డోస్‌పై జరిగే అధ్యయనంలో పాల్గొనేందుకు అర్హులని తెలిపింది.

### వలంటీర్లు దొరక్క ఇబ్బందులు

క్లినికల్ ట్రయల్స్ నిర్వహించేందుకు ఆగస్టులో డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆఅఉఎ) వేలూరు సీఎంసీకి అనుమతి ఇచ్చింది. కొవిషీల్డ్ రెండు మోతాదులు తీసుకున్న 200 మంది వలంటీర్ల నియామకం పూర్తి చేయగా.. కొవాగ్జిన్‌పై అధ్యయనం కోసం వలంటీర్లను గుర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ట్రయల్స్‌లో పాల్గొనే వారికి మూడో డోసు ఇవ్వనున్నారు. కొవిషీల్డ్, కొవాగ్జిన్ ట్రయల్స్ డేటాను ఏకకాలంలో విడుదల చేయనున్నారు.

అధ్యయనంలో పాల్గొనే వారిలో బూస్టర్ మోతాదు తర్వాత ఎంత మేరకు యాంటీబాడీలు, టీ సెల్స్ ప్రతిస్పందనను పరిశీలించనున్నారు. సీఎంసీ వేలూరు సదరు టీకా కంపెనీలే అధ్యయనానికి నిధులు సమకూర్చనున్నాయి. కంపెనీలు సైతం పరిశోధనలకు సహకారం అందిస్తున్నాయి. ట్రయల్స్ కోసం బ్యాచ్ టీకాలు సైతం అందుబాటులో ఉంచినట్లు సంబంధిత వర్గాలు వివరించాయి.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ సరసున నవలలు వ్రాయుచు
బరసున మహిళలను నిలు పన్రుల్ప్రాభవతలూ
తెరవరదుఖ కెరుగించెను
శిరసువంచరు "వాసిరెడ్డి సీతాదేవి"నే !!

(డిసెంబర్ 15 వాసిరెడ్డి సీతాదేవి జయంతి...)

–రాధశ్రీ

సెల్: 9494481210



నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## ఇంజనీరింగ్ విద్యార్థులకు గుడ్ న్యూస్.. ఎంపికైతే 2 లక్షల స్కాలర్‌షిప్

హైదరాబాద్, డిసెంబర్ 14: బీటెక్, డిప్లొమా చదివే విద్యార్థులకు సువర్ణావకాశం. ఉన్నత విద్యను అభ్యసించే ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం అఖిల భారత సాంకేతిక విద్యామండలి పలు స్కాలర్‌షిప్‌లను తీసుకొచ్చింది. పేద విద్యార్థులు, దివ్యాంగులు, అనాథలు, అమర జవాన్ల పిల్లల కోసం మొత్తం మూడు రకాల స్కాలర్‌షిప్‌లను ఏఐసీటీఈ అందజేస్తున్నది. అర్హులైన విద్యార్థులు ఎన్ఎస్‌పీ లేదా ఏఐసీటీఈ వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన విద్యార్థులకు ఏడాది కి రూ. 50వేల చొప్పున.. నాలుగేండ్ల పాటు రూ.2 లక్షల స్కాలర్‌షిప్ అందజేయనున్నారు.

## మిషన్ భగీరథ పై బట్టబయలైన కేంద్రం వివక్ష : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, డిసెంబర్ 14: ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందించేందుకు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకం విషయంలో కేంద్రం పక్షపాత ధోరణి మరోమారు పార్లమెంట్ సాక్షిగా బట్టబయలు అయిందని పంచాయతీ రాజ్ శాఖా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వ్యాఖ్యానించారు. మంగళవారం రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర జలజీవన్ మిషన్ శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ.. 2018 నుంచి 2021–22 వరకు 2455.82 కోట్ల రూపాయల నిధులు కేటాయించామని లిఖితపూర్వకంగా తెలిపారు. అయితే అందులో ఈ నాలుగేళ్లలో కేవలం 311. 41 కోట్ల రూపాయలు మాత్రమే విడుదల చేసిందని మంత్రి తెలిపారు. ఈ నిధులను సైతం నేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ వాటర్ సప్లై ప్రోగ్రాం నిర్వహణ, దానిపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమానికి వినియోగించామని ఆయన పేర్కొన్నారు.

ఇందులో నుంచి ఒక్క రూపాయి కూడా తెలంగాణ మిషన్ భగీరథకు అందించలేదు. పైగా మిషన్ భగీరథ పథకాన్ని ఆకాశానికి ఎత్తుతూ, అద్భుతంగా ఉందని అభినందిస్తూ అనేక అవార్డులను కేంద్రమే ఇచ్చింది. అలాగే మిషన్ భగీరథ పథకాన్ని కాపీ కొట్టి జల్ జీవన్ మిషన్ పథకాన్ని జాతీయ స్థాయిలో ప్రవేశట్టిందన్నారు.

ఒక దశలో నీతి ఆయోగ్ 19వేల కోట్లు మిషన్ భగీరథకు ఇవ్వాలని సిఫారసు చేసినా కేంద్రం పట్టించుకోలేదని మంత్రి ఎర్రబెల్లి ఆవేదన వ్యక్తం చేశారు. అదే కేంద్ర ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాలైన ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్‌లకు పనులు మొదలుపెట్టిన దశలోనే వందలాది కోట్ల రూపాయల నిధులను ధారాదత్తం చేసిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష మానుకొని తగు నిధులు అందించాలని మంత్రి దయాకర్ రావు డిమాండ్ చేశారు.

## ఎన్నికలకు ముందు కాషాయ పార్టీకి గంగా నది గుర్తుకొస్తుంది : మోదీ వారణాసి టూర్‌పై దీదీ ఫైర్

కోల్‌కతా, డిసెంబర్ 14::: ప్రధాని నరేంద్ర మోదీ వారణాసి పర్యటనపై పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. ఎన్నికలు దగ్గరపడిన సమయంలో ప్రదాని వారణాసికి వెళ్లి గంగా నదిలో మునిగి ఆలయంలో కూర్చుంటారని ఆమె చురకలు వేశారు. కొవిడ్–19 సోకి ప్రజలు మరణించిన సమయంలో మృతదేహాలు గంగానదిలో పడేసిన నేపథ్యంలో ప్రధాని ఆ నదిలో ఎలా మునకేశారని దీదీ ప్రశ్నించారు.

బీజేపీ నేతలు ఎన్నికలప్పుడే గంగా నదిని గుర్తుంచుకుని ఆపై ఎన్నికలు ముగిశాక మర్చిపోతారని ఎద్దేవా చేశారు. తాను బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వ్యక్తినని, హిందూ పద్ధతులపై తనకు కాషాయ పార్టీ సర్టిఫికెట్ అవసరం లేదని దీదీ స్పష్టం చేశారు. తమ ప్రాంతంలో 40 ఏండ్లుగా కాళీ పూజ జరుగుతోందని, తాను జగధాత్రి సహా ఇతర పూజల్లో పాల్గొంటానని ఆమె చెప్పుకొచ్చారు.ఖశ్రీజీఎజనిఎబీబివ

దుర్గా పూజల సమయంలో ప్రతి మంటపానికి తాము రూ 50,000 ఇస్తామని బీజేపీ ఇలాంటి కార్యక్రమం చేస్తోందా అని ప్రశ్నించారు. ఈద్ వేడుకల్లోనూ తాను మైనారిటీలతో కలిసి పాల్గొంటానని, క్రిస్మస్ వేడుకల్లోనూ పాలుపంచుకుంటానని, గురుద్వారను కూడా సందర్శిస్తానని దీదీ చెప్పారు. తనకు అన్ని మతాలూ ఒకటేనని ఆమె స్పష్టం చేశారు.

# పొగ తాగడం ఆరోగ్యానికి హానికరమని మనకు తెలుసా..!

ప్రపంచ దేశాల్లో పొగాకు ఉత్పత్తుల వినియోగంలో ఇండియా 2వ స్థానంలో ఉంది. పొగాకు ఉత్పత్తుల్లో బీడీలు, చుట్టలు, సిగరెట్లు, జర్దా, హుక్క, నశం, పొగాకు పైప్, గుట్కా, డోకా, ఖైనీ, క్రెటెక్స్, ఎలక్ట్రానిక్ సిగరెట్లు లాంటి అనేక ఉత్పత్తులు వస్తాయి. ఇండియాలో దాదాపు 267 మిలియన్ల పొగాకు ఉత్పత్తుల వినియోగదారులు (42.4 శాతం పురుషులు, 14.2 శాతం మహిళలు) ఉన్నారు. మన దేశంలో 15 ఏండ్లు దాటిన పెద్దలు 28.6 శాతం, 13-15 ఏండ్ల లోపు విద్యార్థులు 8.5 శాతం (9.6 శాతం బాలురు, 7.4 శాతం బాలికలు) పొగాకు దురలవాటులో మునిగి పోయి ఉన్నారు. ప్రత్యక్షంగా పొగాకు ఉత్పత్తులను వాడే వారితో పాటు 30.2 శాతం పెద్దలు, 21 శాతం 13-15 ఏండ్ల యువత పరోక్షంగా పొగాకు పొగ పీల్చుతూ, సెకండ్‌హ్యాండ్ స్మోకర్స్‌గా జబ్బులపాలు అవుతున్నారు. పొగాకు వినియోగంతో కాన్సర్, గుండె జబ్బులు, మధుమేహం, దీర్ఘకాలిక శ్వాసకోశ సంబంధ వ్యాధులు లాంటివి పెరుగుతున్నాయి. పొగాకు దురలవాటుతో ఇండియాలో ప్రతి ఏట 1.2 మిలియన్ల మరణాలు నమోదు కావడం దురదృష్టకరం. ప్రపంచంలోని స్మోక్‌లెస్ పొగాకు వినియోగం 70 శాతం భారత్‌లోనే జరుగుతోంది. మె?త్తం క్యాన్సర్ కేసుల్లో 27 శాతం కేసులు పొగాకు దురలవాటు వల్లనే నమోదు అవుతున్నాయి. పొగాకు దురలవాటుతో జీవితకాలం 6-10 ఏండ్లు తగ్గవచ్చని హెచ్చరిస్తున్నారు. పొగాకు దురలవాటుతో భారతదేశం రూ: 1,77,340 కోట్ల ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తున్నదని అంచనా.

పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని తగ్గించడానికి తీసుకోవలసిన జాగ్రత్తల్లో ఉత్తమమైన మార్గంగా పొగాకు ఉత్పత్తులపై పన్నులు పెంచడం జరగాలి. 2017 తరువాత గత 4-ఏండ్లుగా పొగాకు ఉత్పత్తులపై భారత ప్రభుత్వం పెద్దగా పన్నులను పెంచలేదు. 2020-21 బడ్జెట్‌లో సిగరెట్లపై 5 శాతం వరకు పన్నులు పెంచడం జరిగింది. పొగాకు ఉత్పత్తులపై పన్ను పెంచని కారణంగా పరిశ్రమలు అధిక లాభాలను పొందుతూ, పొగాకు వాడకాన్ని ప్రత్యక్షంగా ప్రోత్సహిస్తున్నారు. పొగాకు ఉత్పత్తులపై పన్నులు పెంచడంతో పొగాకు ఉత్పత్తుల ధరలు పెరిగి దురలవాటు తగ్గడంతో పాటు ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుంది. పొగాకు ఉత్పత్తుల పన్నులతో (ఎక్సైజ్ డ్యూటీ, జియస్‌టి, యన్‌సిసిడి, సెస్ లాంటివి) రూ: 53,750 కోట్ల రెవెన్యూ సమకూరుతోంది. గ్లోబల్ అడల్ట్ టొబాకో సర్వే వివరాల ప్రకారం 2009-10 నుంచి 2016-17 వరకు పొగాకు వాడకం పడిపోవడంతో ఇండియాలో 17.3 శాతం వినియోగం తగ్గింది.

ప్రపంచవ్యాప్తంగా పొగాకుపై పన్నులు పెంచడం మాత్రమే దాని వినియోగాన్ని తగ్గిస్తుందని అభిప్రాయపడుతున్నారు. పొగాకు పన్నులు తక్కువగా ఉండడంతో అలవాటు కలిగిన వారిలో వాడకం పెరగడంతో పాటు కొత్త వినియోగదారులు పుట్టుకొస్తున్నారని తెలుస్తున్నది. నేషనల్ హెల్త్ పాలసీ-2017 ప్రకారం 2025 నాటి భారత ప్రభుత్వం పొగాకు వినియోగాన్ని 30 శాతం తగ్గించాలనే లక్ష్యం పెట్టుకుంది. భారత ప్రభుత్వం బీడీలపై 22 శాతం, సిగరెట్లపై 53 శాతం, పొగరాని పొగాకు ఉత్పత్తులపై 63 శాతం పన్నులు విధిస్తున్నది. డబ్ల్యూహెచ్‌ఓ ప్రతిపాదనల ప్రకారం పొగాకు ఉత్పత్తులపై కనీసం 75 శాతం పన్నులు విధించాల్సి ఉంటుంది. జియస్‌టీ పన్నుల విధానం ప్రవేశ పెట్టిన తరువాత గత 4-ఏళ్ళలో పొగాకుపై పన్నులను పెంచకపోవడం సోచనీయం. పొగాకు మె?త్తం పన్నులో సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ షేర్ 2017 నుంచి 2021 వరకు బీడీలపై 17 శాతం నుంచి 1 శాతం వరకు, సిగరెట్లపై 54 శాతం నుంచి 8 శాతం వరకు, పొగరాని ఉత్పత్తులపై 59 శాతం నుంచి 11 శాతం వరకు తగ్గించడం ఆశ్చర్యకరంగా తోస్తున్నది.

పొగాకు ఉత్పత్తులపై పన్నులను పెంచుతూ, నిత్యసరాలపై పన్నులు తగ్గిస్తే పేదలకు అసలైన న్యాయం జరుగుతుంది. పొగాకు ఉత్పత్తులు చవకగా, తక్కువ పన్నులతో లభించిన ఫలితంగా ప్రజావినియోగం, ముఖ్యంగా పేదల్లో పెరుగుతూ అతి పెద్ద ప్రజారోగ్య సమస్య ఉత్పన్నం అవుతున్నది. ప్రపంచ దేశాలు ప్రతి ఏట పొగాకు పన్నులు పెంచడం జరిగినా, భారత్‌లో మాత్రం గత కొన్ని ఏండ్లుగా పన్నులు పెంచకపోవడంలో ఆంతర్యం అర్థం కావడం లేదు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని భారత ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులపై అన్ని రకాల పన్నులను క్రమంగా పెంచడం జరగాలి. బీడీ, సిగరెట్, జర్దా లాంటి ఉత్పత్తుల ధరల్ని పెంచడంతో క్రమంగా వాటి ప్రజావినియోగం తగ్గుతూ, ప్రజారోగ్యం కుదుట పడుతుందని గమనించాలి. పొగ తాగడం ఆరోగ్యానికి హానికరమని ప్రకటనలు చేసి ప్రజారేగ్యాన్ని పొగాకు మంటలకు వదిలేయరాదని, ఆరోగ్యకర భారత నిర్మాణంలో పొగాకు ఉత్పత్తులకు తావులేదనే విషయాలను ప్రభుత్వాలు, స్వచ్ఛంధ సంస్థలు, పౌర సమాజం మరువరాదు.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# ఎంఎస్‌ఎంఇ- ఎన్‌ఎస్‌ఐసి రుణంతో విజయవంతమైన వ్యాపరవేత్తగా పరివర్తన చెందిన సుమిత్ కుమార్

న్యూఢిల్లీ, డిసెంబర్ 14:తన కలల వ్యాపారమైన శుభ్రత కోసం వినియోగించే ప్లాస్టిక్ బ్రష్‌లను ఉత్పత్తి చేసే సంస్థను సుమిత్ ఎంటర్‌ప్రైజెస్ పేరిట 2018లో ఆగ్రాకు చెందిన సుమిత్ కుమార్ ప్రారంభించాడు. అత్యంత సాధారణ నేపథ్యం నుంచి వచ్చిన సుమిత్, ఒక కర్మాగారంకూలీ స్థాయి నుంచి వ్యాపారవేత్తగా పరివర్తన చెంది గొప్ప విజయాలను సాధించాడు. తన వ్యాపార ప్రయాణాన్ని గురించి మాట్లాడుతూ, నేను రూ. 2 వలక్షల తో నా వ్యాపారాన్ని ప్రారంభించాను. మార్కెట్‌లో నా ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతున్నప్పటికీ నిధుల కొరత వల్ల నేను ఆర్డర్లను తీసుకోలేకపోయేవాడిని. నాకు రుణం అవసరమైంది కానీ దురదృష్టవశాత్తు బ్యాంకు నా విజ్ఞప్తిని తోసిపుచ్చింది. ఆ తర్వాత నేను ఎంఎస్‌ఎంఇ శాఖకు వెళ్ళి, వారి మద్దతుతో రూ. 411000 రుణాన్ని పొందగలిగాను. నేడు నా అర్ధ సంవత్సర టర్నోవర్ రూ. 30 లక్షలుగా ఉంది. నేను ఎన్‌ఎస్‌ఐసి ఎంఎస్‌ఎంఇ రుణం కారణంగా కూలీ స్థాయి నుంచి వ్యాపార యజమానిగా పరివర్తన చెందగలిగాను, అని సుమిత్ వివరించాడు. ఎంఎస్‌ఎంఇ మంత్రిత్వ శాఖ అతడు స్వావలంబన సాధించేందుకు అతడిని సాధికారం చేసింది.

# గంగా ఆరతికి హాజరైన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 14:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిన్నటి రోజు న వారాణసీ లో బాబా విశ్వనాథ్ ధామ్ ప్రారంభ కార్యక్రమం తరువాత కూడా తన కార్యక్రమాల ను కొనసాగించారు. వాటిలో భాగం గా ఆయన పూజల లో పాలుపంచుకొన్నారు; గంగ లో పవిత్ర స్నానాన్ని ఆచరించారు. ఆ తరువాత సాయంత్రం పూట గంగా ఆరతి కార్యక్రమాని కి ప్రధాన మంత్రి హాజరయ్యారు.

కాశీ లో నిర్వహించే ఆరతి కార్యక్రమం మనస్సు ను ఎల్లప్పుడూ గొప్ప శక్తి తో నింపి వేస్తుంది అని పేర్కొన్నారు. "కాశీ లో జరిగే గంగా ఆరతి కార్యక్రమం సదా అంతరంగాన్ని కొత్త శక్తి తో నింపివేస్తూ ఉంటుంది. ఈ రోజు న కాశీ యొక్క పెద్ద కల నెరవేరిన మీదట దశాశ్వమేధ్ ఘాట్ లో గంగా ఆరతి కార్యక్రమం లో పాలుపంచుకొన్నాను. గంగ మాత కు ఆమె కృప కోసం నమస్కరించాను. నమామి గంగే తవ్ పాద్ పంకజమ్" అని ఆయన పేర్కొన్నారు.

అనంతరం ముఖ్యమంత్రుల తో, ఉప ముఖ్యమంత్రుల తో ప్రధాన మంత్రి ఒక విస్తృత సమావేశాన్ని నిర్వహించారు

ప్రధాన మంత్రి ఒక ట్వీటల్ లో "కాశీ లో ఏఃఏఖ4ఎనిటతిజీ ముఖ్యమంత్రుల తో, ఉప ముఖ్యమంత్రుల తో ఓ విస్తృత సమావేశం కొద్ది సేపటి కిందటే ముగిసింది' అని పేర్కొన్నారు.

# వీధికుక్క స్వైర విహారం.. ఇద్దరి పరిస్థితి విషమం



హైదరాబాద్, డిసెంబర్ 14:గ్రామీణ ప్రాంతాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. గ్రామ సింహాలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామాన్ని రక్షించే గ్రామ సింహాలే ఇప్పుడు ప్రజల పాలిట మృత్యు సింహాలుగా మారుతున్నాయి. విశ్వాసానికి కేరాఫ్‌గా అడ్రస్‌గా నిలిచే కుక్కలు ఇప్పుడు దాడులు చేస్తున్నాయి. అనంతగిరి మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో పిచ్చి కుక్క స్వైర విహారం చేయడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు.

వడ్డే సాయి అనే చిన్నారి తన తాతతో కలిసి ఉపాధి హామీ పనికి వెళ్లగా పొలం గట్టుపై కూర్చొని ఉన్న సాయిపై ఒక్కసారిగా పిచ్చి కుక్క దాడి చేసి రెండు చేతులను తీవ్రంగా గాయపరిచింది. అంతేకాక గ్రామ శివారులో తన పొలంలో నిద్రపోతున్న గోపతి సత్యం అనే రైతును సైతం విసక్షణా రహితంగా మొఖంపై దాడి చేసి పెదవులను కొరికి పడవేసింది. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం హాస్పిటల్ కు తీసుకెళ్లారు. పిచ్చి కుక్కల బెడద ఉందని సర్పంచ్ కార్యదర్శికి ఎన్ని ఫిర్యాదులు చేసినా స్పందించక పోవడం వల్లే ఇప్పుడిలా జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో పిచ్చి కుక్కల బెడద ఎక్కువై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. కుక్కల సంఖ్య పెరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు. ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదని విమర్శలు వస్తున్నాయి.

# కె. గౌదమాన్ సంస్థకు రెక్కలు పొదిగిన ఎంఎస్‌ఎంఈ అంతర్జాతీయ సహకార పథకం

న్యూఢిల్లీ, డిసెంబర్ 14:తన దేశ అభివృద్ధికి కట్టుబడి, ఒక వ్యవస్థాపకుడు కావాలనే స్ఫూర్తితో శ్రీ కె. గౌడమాన్ బ్రిటన్ నుండి చెన్నైకి వలస వచ్చారు. ఆయన ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేట్ అయినప్పటికీ, పారిశ్రామికవేత్తగా మారే అతని ప్రయాణం అంత సులభం కాదు. ప్రారంభ దశ సమయం అతనికి చాలా ఉద్వేగభరితంగాను, కష్టంగాను నిలిచింది. ఎందుకంటే తన వ్యాపారానికి నిధులను ఏర్పాటు చేయడానికి అతను తన తల్లి ఆభరణాలను తనఖా పెట్టవలసి వచ్చింది. ఈ రోజు అతను స్థాపించిన సంస్థ సీజడ్ స్మార్ట్ మొబిలిటీ సొల్యూషన్స్ పార్కింగ్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్‌లను అందిస్తోంది. ఆయనకు అంతర్జాతీయ సహకార పథకం రూపంలో ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ నుండి మద్దతు లభించింది, ఇది అతని వ్యాపారాన్ని కొత్త స్థాయికి తీసుకువెళ్లింది. "నేను ఎంఎస్‌ఎంఈ/ఎన్‌సీఐసీ గుడుకు కిందకు వెళ్లాను. మీరు మీ సంస్థను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం కల్పించాలనుకుంటే మీరు అంతర్జాతీయ సహకార పథకాన్ని ఉపయోగించుకోవచ్చు" అని శ్రీ గౌధమాన్ సూచిస్తాడు. నేడు సీజెడ్ స్మార్ట్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన బ్రాండ్‌గా ఎదిగింది.

# జల్ జీవన్ మిషన్ కేంద్ర గ్రాంటుగా జమ్మూ కాశ్మీర్‌కు 604 కోట్ల రూపాయలు విడుదల

న్యూఢిల్లీ, డిసెంబర్ 14:జమ్మూ కాశ్మీర్ లో జల్ జీవన్ మిషన్ ను వేగంగా అమలు చేయడానికి రాష్ట్రానికి కేంద్రం 604 కోట్ల రూపాయలను గ్రాంటుగా విడుదల చేసింది. కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూ కాశ్మీర్ లో జల్ జీవన్ మిషన్ ను అమలు చేయడానికి 2021-22 సంవత్సరంలో కేంద్ర నిధులుగా 2,747 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగింది. 2020-21 తో పోల్చి చూస్తే ఈ కేటాయింపులు నాలుగు రెట్లు పెరిగాయి.

2022 ఆగస్టు నాటికి 'హర్ ఘర్ జల్' గుర్తింపు పొందడానికి జమ్మూ కాశ్మీర్ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తోంది. కేంద్రపాలిత జమ్మూ కాశ్మీర్ గ్రామీణ ప్రాంతంలో 18.35 లక్షల గృహాలు ఉన్నాయి. వీటిలో 10.39 లక్షల (57%) గృహాలు కొళాయి కనెక్షన్ కలిగి ఉన్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, క్లిష్ట భూభాగంలో రవాణా సమస్యలు ఎదురవుతున్నాయి. అయితే, గ్రామాల్లో ప్రతి ఇంటికి కొళాయి ద్వారా నీరు సరఫరా చేయడానికి చేపట్టిన నీటి సరఫరా పనులు వేగంగా సాగుతున్నాయి. శ్రీనగర్, గందేర్బల్ జిల్లాల్లో గ్రామీణ ప్రాంతంలో ఉన్న 1,070 గ్రామాల్లో ప్రతి ఇంటికి కొళాయి ద్వారా నీరు సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందింది.

దేశంలో గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రతి ఇంటికి కొళాయి ద్వారా నీరు సరఫరా చేయాలన్న లక్ష్యంతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తోంది. దీనికోసం బడ్జెట్ కేటాయింపులు భారీగా పెరిగాయి. 2021-22 లో దీనికోసం 2,747.17 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగింది. గత సంవత్సరం ఈ పథకానికి 681.77 కోట్ల రూపాయలు కేటాయించారు.

వికేంద్రీకృత విధానంలో 'కింద నుంచి పైకి' పద్ధతిలో జల్ జీవన్ మిషన్ అమలు జరుగుతోంది. దీనిలో పనుల గుర్తింపు, అమలు, నిర్వహణలో గ్రామ ప్రజల పాత్ర కీలకంగా ఉంటుంది. దీనికోసం నీటి సంఘాలను పటిష్టం చేయడం, గ్రామ స్థాయి ప్రణాళిక రూపకల్పన, గ్రామానికి అవసరమైన నీటి పథకాలను గుర్తించి వాటిని అమలు చేయాల్సిన విధానాన్ని చర్చించడానికి గ్రామ సభలను నిర్వహించడం లాంటి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుంది. ప్రతి గృహంలో కీలక బాధ్యత వహించే మహిళలు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనేలా చూసేందుకు ప్రాధాన్యత ఇస్తారు. కార్యక్రమం పై ప్రజల్లో అవగాహన కల్పించి, సురక్షిత మంచినీటి ప్రాధాన్యత, ప్రజల భాగస్వామ్యం, కార్యక్రమాన్ని అమలు చేయడానికి పంచాయతీరాజ్ సంస్థలకు సహకారం అందించడం లాంటి కార్యక్రమాలను అమలు చేయడానికి మంత్రిత్వ శాఖ సంస్థలను నియమిస్తుంది. అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో తాగడానికి,మధ్యాహ్న భోజనం వండడానికి, చేతులు కడుక్కోవడానికి, మరుగుదొడ్లలో వాడుకోవడానికి కుళాయి నీటి లభ్యత ఉండేలా కృషి చేస్తున్నారు. ఇప్పటి వరకు జమ్మూ కాశ్మీర్ లో అన్ని 22,421 పాఠశాలలు (100%) మరియు 23,926 (100%) అంగన్వాడీ కేంద్రాలకు కొళాయి ద్వారా నీరు సరఫరా అవుతోంది.

ప్రజారోగ్య పరిరక్షణలో రక్షిత మంచి నీటి సరఫరాకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. నీటి నాణ్యతను పరీక్షించడానికి దేశంలో 2,000 పైగా ప్రయోగశాలలు పనిచేస్తున్నాయి. తక్కువ ధరకు ప్రజలు వీటిలో నీటి నాణ్యత పరీక్షల సౌకర్యాన్ని పొందవచ్చు. జమ్మూ కాశ్మీర్ లో 97 ప్రయోగశాలలు పనిచేస్తున్నాయి.

2019 లో మిషన్ ప్రారంభం కాకముందు దేశ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 19.20 కోట్ల గృహాలలో కేవలం 3.23 గృహాలు (17%) మాత్రమే కుళాయి కనెక్షన్ కలిగి ఉన్నాయి. కోవిడ్-19 మహమ్మారి, లాక్ డౌన్ వల్ల ఎదురైన సవాళ్ళను అధిగమించి మిషన్ ప్రారంభం అయిన నాటి నుంచి ఇంతవరకు 5.42 కోట్లకు పైగా ( 28%) గృహాలకు కుళాయి కనెక్షన్ కల్పించబడింది. ప్రస్తుతం దేశంలో 8.65 కోట్ల గృహాలకు కుళాయి ద్వారా రక్షిత మంచి నీరు సరఫరా అవుతోంది.

గోవా, తెలంగాణ, అండమాన్ నికోబార్ దీవులు, దాద్రా నగర్ హవేలీ మరియు డామన్ దయ్యూ, పుదుచ్చేరి మరియు హర్యానాలు 'హర్ ఘర్ జల్' రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతాలుగా మారాయి. వీటిలో 100% గ్రామీణ కుటుంబాలకు కుళాయి నీటి సరఫరా ఉంది. అందరి సహకారం, నమ్మకం, తోడ్పాటు తో పథకాన్ని అమలు చేయాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సూచన మేరకు గ్రామీణ ప్రాంతంలో ప్రతి ఒక్కరికి, ప్రతి ఇంటికి కుళాయి నీటి కనెక్షన్ అందించబడుతుంది. ప్రస్తుతం 83 జిల్లాల్లోని ప్రతి ఇంటికి, 1.28 లక్షలకు పైగా గ్రామాలకు కుళాయి ద్వారా నీటి సరఫరా జరుగుతోంది.

# ఇకపై అన్ని వర్సిటీలకు ఒకే అకాడమిక్ క్యాలెండర్..

హైదరాబాద్, డిసెంబర్ 14:రాష్ట్రంలోని ఒక యూనివర్సిటీకి చెందిన విద్యార్థులకు తరగతులు ఉంటే.. మరో యూనివర్సిటీ పరిధిలోని పీజీ విద్యార్థులకు సెలవులుండేవి. ఓ యూనివర్సిటీ విద్యార్థులకు పరీక్షలుంటే.. మరో వర్సిటీ విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యేవి. ఇది ప్రస్తుతం రాష్ట్రంలోని ఆరు ప్రధానమైన యూనివర్సిటీల విద్యావిధానం పరిస్థితి. ఈ విధానంతో విద్యార్థుల్లో, అధికారుల్లో కొంత గందరగోళం ఉండేది. ఇకమీదట ఈ విధానానికి అధికారులు స్వస్తిపలకనున్నారు. నూతన షెడ్యూల్ ప్రకారం అన్ని వర్సిటీల్లో ఒకే సారి తరగతులు ప్రారంభమై ఒకేసారి పరీక్షలు, సెలవుల విధానాన్ని పాటించనున్నాయి. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, తెలంగాణ, శాతవాహన, మహాత్మాగాంధీ యూనివర్సిటీలు ఇక కామన్ పీజీ క్యాలెండర్ విధానాన్ని పాటించనున్నాయి. 2021-22 విద్యా సంవత్సరం నుంచే ఇది అమల్లోకి రానుంది. హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో విద్యామండలి ఛైర్మన్ ప్రొ. ఆర్. లింబాద్రి నేతృత్వంలో సోమవారం జరిగిన ఆరు యూనివర్సిటీ ఉపకులపతుల సమావేశంలో ఈమేరకు అధికారులు నిర్ణయించారు.

అదేవిధంగా అన్ని వర్సిటీల్లో ఒకేసారి తరగతులు, ఇంటర్నల్స్, సెమిస్టర్ పరీక్షలను నిర్వహించేలా షెడ్యూల్‌ను రూపొందించనున్నారు. 2021-22 విద్యాసంవత్సరానికి జనవరి నుంచి పీజీ క్లాసులు ప్రారంభం కానున్నాయి. ఆరు వర్సిటీల్లో ప్రవేశాలకు కామన్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ (సీపీజీఈటీ) నిర్వహిస్తున్న నేపథ్యంలో తరగతులు, పరీక్షలను కూడా ఒకేసారి నిర్వహిస్తే విద్యార్థులకు ప్రయోజనం ఉంటుందని మండలి ఛైర్మన్ లింబాద్రి తెలిపారు.

# పెచ్చులూడుతున్న గోడలు, విరిగిన మంచాలు.. ఉస్మానియా'గా ఎప్పుడు మారుతదో..

హైదరాబాద్, డిసెంబర్ 14:తెలంగాణ రాష్ట్రంతోపాటు పొరుగున ఉన్న కర్ణాటక, ఏపీ, చత్తీస్‌గడ్ రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ పెద్దాసుపత్రిగా పేరొందిన హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రి సమస్యలకు నిలయంగా మారింది. రోగుల వ్యాధులను నయం చేయాల్సిన ఈ పెద్దాసుపత్రికే వైద్యం అందించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 100 ఏళ్లకు పైబడిన చరిత్ర, పేదలకు వైద్యం అందించడంలో పేరున్న వైద్యులు ఉండడంతో ఉస్మానియాలో చికిత్స చేయించుకునేందుకు పేదలు ఇక్కడికి వస్తుంటారు. రోజు రోజుకూ ఓపీ వైద్యం కోసం వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది, దాంతోపాటు ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్ అడ్మిషన్లు కూడా పెరుగుతున్నాయి. అయితే పేషెంట్ల పెరుగుదలకు సరిపడా స్థాయిలో ఆసుపత్రిలో సౌకర్యాలు కరువయ్యాయి.

కొన్ని నెలలుగా ఉస్మానియా ఆసుపత్రి పాత భవనాన్ని మూసివేయడంతో పడకల సామర్థ్యం బాగా తగ్గిపోయింది.

పాత భవనాన్ని మూసివేయడం, కొత్త భవనం నిర్మించే విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంతో రోగులకు వైద్యం ఎలా అందించాలో వైద్యులకు పాలుపోని వింత పరిస్థితి ఉస్మానియా ఆసుపత్రిలో రాజ్యమేలుతోంది. చివరకు విధులు నిర్వహిస్తోన్న వైద్యులపై ఫ్యాన్ ఊడిపడిన ఘటన కూడా ఇటీవలే చోటు చేసుకుంది. ఈ పరిస్థితిల్లో



ఆసుపత్రిలో భయం భయంగా విధులు నిర్వహించాల్సి వస్తోందని జూనియర్ డాక్టర్లు, వైద్యులు, సిబ్బంది వాపోతున్నారు.

బెడ్లు దొరక్క, దొరికినా చెట్ల కిందనో, కిటికీల పక్కనో, వరండాలోనో చికిత్స పొందాల్సిన దీనస్థితి ఉస్మానియాలో నెలకొంది. చినుకు పడితే నదీ ప్రవాహాన్ని తలపిస్తుందని రోగులు, వారి సహాయకులు, ఆసుపత్రి సిబ్బంది వాపోతున్నారు. ఆసుపత్రిలో పారిశుధ్యం లోపించింది. ఆసుపత్రి ప్రాంగణాలు ఎటుచూసినా దుర్గంధంతో నిండిపోతున్నాయని చెబుతున్నారు. ఓ వైపు కరోనా వైరస్, మరో వైపు సీజనల్ వ్యాధులు, చలికాలం ఫ్లూ వ్యాధులు పంజా విసురుతున్నా ఆసుపత్రిలో చాలా వైద్య ఉపకరణాలు, డయాగ్నస్టిక్ మిషన్లు పనిచెయడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతు న్నాయి.

ఉస్మానియా ఆసుపత్రి సమస్యల ఊబిలో కూరుకుపోయిన ఈ సమయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి హరీష్‌రావు ఉస్మానియా ఆసుపత్రిని సందర్శించనున్నారు. మంత్రి హరీష్‌రావు చొరవతొనైనా ఆసుపత్రి భవన నిర్మాణ అంశం కొలిక్కి వస్తుందని అటు రోగులు, ఇటు సిబ్బంది గంపెడాశలతో ఎదురు చూస్తున్నారు. ఆసుపత్రికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలని మంత్రిని వేడుకుంటున్నారు.

# ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని పరామర్శించిన షర్మిల



హైదరాబాద్, డిసెంబర్ 14:వైఎస్సార్ టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల మెదక్ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈరోజు జిల్లాలోని వర్గల్ మండలం దండుపల్లిలో పర్యటించిన షర్మిల ఆత్మహత్య చేసుకున్న రైతు చింతలస్వామి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ధరణిలో లోపాల వల్ల రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. సీఎం నియోజకవర్గంలోనూ భూసమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. సమస్య పరిష్కారం కాదు.. భూమి వదులు కోవాల్సిందే అనడంతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. బాధిత రైతు కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని షర్మిల డిమాండ్ చేశారు. ధరణి ఎవరికి మేలు చేయడానికి అని షర్మిల ప్రశ్నించారు.

# ఉర్సు ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకలు : ఎమ్మెల్యే వివేకానంద



రంగారెడ్డి, డిసెంబర్ 14:ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకలు అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. ఈ రోజు తన నివాసం వద్ద 129-సూరారం డివిజన్ పరిధిలోని షాపూర్ నగర్ మార్కెట్టు వద్ద కొలువుదీరిన జిందా షా మదర్ చిల్లా 103వ ఉర్సు ఉత్సవాలు ఈ నెల 23న నిర్వహిస్తున్న సందర్భంగా గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ పెద్దలు అమీరఖాన్, ఎం.అరుణ్, సిద్ధికి, పద్మారావు, చోటు, వరుణ్ గౌడ్, మసూద్, ఆబిద్ తదితరులు పాల్గొన్నారు

# పింఛన్ దారులకు సీఎం జగన్ గుడ్ న్యూస్

అమరావతి, డిసెంబర్ 14:ఏపీలోని అవ్వాతాతలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. కొత్త ఏడాదిలో పింఛన్ దారులకు వైయస్ జగన్ సర్కార్ కానుక అందించింది. జనవరి 1, 2022 నుంచి పెన్షన్ రూ.2500కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెన్షన్‌ను రూ.2500కు పెంచి ఇవ్వనుంది ప్రభుత్వం. జనవరి 1, 2022న అవ్వాతాతలు చేతిలో రూ.2500 పెన్షన్ మొత్తాన్ని పెట్టనుంది.

కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ వెల్లడించారు. ప్రస్తుతం ఇస్తున్న రూ. 2,225 పింఛన్ ను రూ. 2,500కు పెంచుతున్నట్టు ప్రకటించారు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ పెంపు అమల్లోకి వస్తుందని చెప్పారు.

ఈ నెల 21న జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకాన్ని ప్రారంభించనున్నట్టు చెప్పారు. వచ్చే ఏడాది జనవరి 9న ఈబీసీ నేస్తం పథకాన్ని అమలు చేయనున్నట్టు తెలిపారు. ఈబీసీ నేస్తం పథకం వల్ల అగ్రవర్ణ నిరుపేద మహిళలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. 45 నుంచి 60 ఏళ్ల వయసున్న నిరుపేద మహిళలకు మూడేళ్లలో రూ. 45 వేల చొప్పున ఆర్థికసాయం చేయనున్నారు. జనవరిలో రైతు భరోసా సాయాన్ని కూడా అందజేస్తామని చెప్పారు.

# విశాఖలో 45 వేల టన్నుల కెపాసిటీ గల షిప్‌లు..



అమరావతి, డిసెంబర్ 14:త్వరలోనే 45 వేల టన్నుల సామర్థం కలిగిన అతి పెద్ద నౌకలను హిందూస్తాన్ షిప్ యార్డు తాయారుచేయనుందని ఆ సంస్థ సీఎండీ హేమంత్ కతిరి ప్రకటించారు. హిందూస్తాన్ షిప్ యార్డు కాలనీలో ఆరు రోజులపాటు నిర్వహిస్తున్న షిప్ యార్డ్ మేళాను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూషిప్ యార్డ్ స్థాపించి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆజాదిక అమృత్ మహోత్సవ్ పేరిట ఈ మేళాను ఏర్పాటు చేసస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13 నుండి 16 వరకు విద్యార్థులకు, ప్రజలకు అందుబాటులో సందర్శనార్థం మేళా నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో 75 ప్రదేశాల్లో షిప్ యార్డ్ మేళాలను రక్షణ శాఖ మంత్రి ప్రారంభించినట్లు ఆయన ప్రకటించారు.

ఇప్పటివరకు షిప్ యార్డులో 200 వరకు నౌకల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. 1972 లో మొట్ట మొదటిసారిగా సింధూవీర్ అనే నౌకను నాలుగు నెలల వ్యవధిలో రిపేర్ చేసి ఇవ్వడమైందన్నారు. షిప్ యార్డ్ నెలకొల్పిన నాటి నుండి నేటి వరకు దాదాపు 2000 వరకు నౌకలను రిపేర్ చేయడమైందన్నారు. షిప్ నిర్మాణ పనుల్లో యార్డులో 2600 మంది వరకు ప్రతినిత్యం ఉపాధి అవకాశాలు పొందదుతున్నట్లు వెల్లడించారు. మరో సంవత్సర కాలంలో 4000 మంది వరకు గుత్తేదారు కార్మికులకు ఉపాధి కల్పన దిశగా హిందూస్థాన్ షిప్ యార్డు అడుగులు వేస్తోందన్నారు.


ఆహ్వానం





తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో...

తెలంగాణ రచయితల సంఘం జంటనగరాలు
సంయుక్త ఆధ్వర్యంలో
దాసరి మోహన్ రెండవ కవితా సంపుటి 'అల్మార'
పుస్తకావిష్కరణ సభ

24-12-2021, శుక్రవారం, ఉదయం 10 గం॥లకు
సమావేశమందిరం, మొదటి అంతస్తు, రవీంద్రభారతి, హైదరాబాద్.

అధ్యక్షులు : శ్రీ కందుకూరి శ్రీరాములు గారు
అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం జంటనగరాలు

ముఖ్య అతిథి, ఆవిష్కరణ : శ్రీ నందిని సిధారెడ్డి గారు
పూర్వ అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమి

విశిష్ఠ అతిథి : శ్రీ మామిడి హరికృష్ణ గారు
సంచాలకులు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ

ఆత్మీయ అతిథులు : శ్రీ అమ్మంగి వేణుగోపాల్ గారు
కాళోజీ నారాయణరావు పురస్కార గ్రహీత
: శ్రీ నాళేశ్వరం శంకరం గారు
అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం
: శ్రీ వఝల శివకుమార్ గారు
అధ్యక్షులు, తెలంగాణ చైతన్య సాహితి
: శ్రీ బెల్లంకొండ సంపత్ కుమార్ గారు
ప్రధాన కార్యదర్శి తెలంగాణ రచయితల సంఘం జంటనగరాలు
: శ్రీమతి వీణావాణి గారు
ప్రముఖ కవయిత్రి

# నకిలీ బంగారాన్ని విక్రయిస్తున్న ముఠా అరెస్టు



హైదరాబాద్, డిసెంబర్ 14:ప్రజలను మోసం చేస్తూ నకిలీ బంగారాన్న విక్రయిస్తూన్న ఇద్దరు ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ బంగారాన్ని విక్రయిస్తూ డబ్బును సంపాదిస్తున్న నిందితులను ఇంతేజా గంజ్ పోలీసులు అరెస్టు చేసారు. వారి నుండి 10 లక్షల 45వేల నగదుతో పాటు, ఐదు సెల్ ఫోన్లు, నకిలీ బంగారు గుండ్ల హారాలను స్వాధీనం చేసుకున్నారు.

నిందితులు మోహన్‌లాల్ వరమర్, సోలంకి ధర్మ, కర్ణాటకనికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ ముఠా అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ డా.తరుణ్ జోషి వివరాలను వెల్లడించారు. నిందితుల్లో ఒకడైన మోహన్‌లాల్ పాత బట్టలను కొనుగోలు వాటిని ఇతర రాష్ట్రాల్లో అమ్మేవాడని చెప్పారు. ఈ క్రమంలో జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచన నకిలీ బంగారాన్ని అమ్ముతున్నారని చెప్పారు.

# స్వచ్ఛ హైదరాబాద్‌లో ప్రతి ఒకరూ భాగస్వాములవ్వాలి

### స్వచ్ఛ ఆటోల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్న మంత్రులు తలసాని, మహమూద్ అలీ

హైదరాబాద్, డిసెంబర్ 14: చెత్త నుంచి విద్యుత్తు (వేస్ట్ టు ఎనర్జీ) ను ఉత్పత్తి చేయడంలో హైదరాబాద్ దేశంలోనే ముందంజలో ఉన్నదని పురపాలక, ఐటీశాఖల మంత్రి కే తారకరామారావు ప్రశంసించారు. జవహర్‌నగర్‌లోని ప్లాంటు ద్వారా మరో 28 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి కేంద్ర పర్యావరణ, అటవీశాఖ అనుమతి లభించిందని చెప్పారు. దీంతో చెత్త నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేసే ఈ ప్లాంటు సామర్థ్యం 48 మెగావాట్లకు పెరుగుతుందని, దేశంలోనే ఇది అతి పెద్దదని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ప్లే గ్రౌండ్‌లో 1,350 స్వచ్ఛ ఆటోలను మంత్రి కేటీఆర్ లాంఛనంగా ప్రారంభించారు.

ఆనంతరం మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ 250 మంది లబ్దిదారులకు స్వచ్ఛ ఆటోలను పంపిణీచేశారు. హైదరాబాద్‌లో గతంలో రోజుకు 3,500 మెట్రిక్ టన్నుల చెత్తను మాత్రమే సేకరించగా, ప్రస్తుత సామర్థ్యం 6,500 మెట్రిక్ టన్నులకు పెరిగిందని వివరించారు. ప్రస్తుతం 5,250 ఆటోల ద్వారా ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములై స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సఫాయి కార్మికుల గౌరవ వేతనాలు మూడుసార్లు పెంచారని మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు.

కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రకటించే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో 40 లక్షల పైబడిన జనాభా విభాగంలో హైదరాబాద్ నగరానికి అవార్డు వస్తున్నదని చెప్పారు. ఇదే స్ఫూర్తితో చెత్త సేకరణపై ఉన్నతాధికారులు మరింతగా దృష్టి సారించి, మెరుగైన ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. 1,350 స్వచ్ఛ ఆటోల పంపిణీతో హైదరాబాద్‌లో పారిశుద్ధ్యం మరింత మెరుగుపడుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ వెంకటేశ్ నేతకాని, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, అదనపు కమిషనర్ సంతోష్, కార్పొరేటర్లు లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# లైంగికదాడి కేసులో 10 సంవత్సరాల జైలు శిక్ష

వరంగల్ డిసెంబర్ 14:: బాలికను పెండ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం కూడా ఏర్పరచుకొని చివరకు ముఖం చాటేసిన వ్యక్తికి 10 సంవత్సరాల జైలు శిక్ష, వేయి రూపాయల జరిమానా విదిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

ఈ కేసులో బాధితురాలి పక్షాన వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెరుకు సత్య నారాయణ కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామానికి చెందిన బాలిక వారి బంధువుల వివాహ సమయంలో నిందితునితో పరిచయం ఏర్పడుతుంది.

మందమర్రి పట్టణానికి చెందిన మాటూరి సుమన్ అనే నిందితుడు పరిచయాన్ని కాస్త ప్రేమగా మార్చి,పెండ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో శారీరక సంబంధం ఏర్పరచుకున్నాడు.

కొద్దిరోజుల తర్వాత మొఖం చాటేసి బాలికను మోసం చేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై హన్మకొండ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు.

సాక్ష్యాధారాలను పరిశీలించిన నాలుగో అదనపు జిల్లా స్థాయి న్యాయస్థానం నిందితుడు ఉద్దేశపూర్వకంగా నేరం చేశాడని భావించి 10 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది.

# జగన్ సర్కార్‌కు హైకోర్టు షాక్ : సినిమా టికెట్లపై జీవో సస్పెండ్

అమరావతి, డిసెంబర్ 14:జగన్ సర్కార్ కు మరోసారి ఎదురు దెబ్బ తగిలింది. టికెట్ల రేట్లు తగ్గిస్తూ ఇచ్చిన జీవో నెం.35ను ఏపీ హైకోర్టు సస్పెండ్ చేసింది. పాత విధానంలో టికెట్ల రేట్లు నిర్ణయించేందుకు పిటిషనర్లకు వెసులుబాటు కల్పించింది. టికెట్ రేట్లను తగ్గిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాల్ చేస్తూ థియేటర్ యజమానులు హైకోర్టు ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ప్రభుత్వం జీవో ఇచ్చిందని వివరించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనది కాదని, కొత్త సినిమాలు విడుదలైన సమయంలో టికెట్ రేట్లు పెంచుకునే హక్కు థియేటర్ యజమానులకు ఉంటుందని పిటిషన్లు పేర్కొన్నారు. దీనిపై ఈరోజు హైకోర్టులో వాదనలు జరిగాయి. టికెట్ రేట్లు తగ్గించే అధికారం ప్రభుత్వానికి లేదని విన్నవించారు. పిటిషనర్ తరపు న్యాయవాదులు చేసిన వాదనలతో కోర్టు ఏకీభవించింది. దీంతో ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.35ను సస్పెండ్ చేస్తున్నట్లు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాత పద్దతుల్లోనే ఏపీలో సినిమా టికెట్ల రేట్లు ఉండనున్నాయి.

# కేటీఆర్ యూత్ ఐకాన్ : మంత్రి వేముల

హైదరాబాద్, డిసెంబర్ 14: కేటీఆర్ దేశంలోనే అత్యంత ప్రతిభావంతుడైన మంత్రి అని, కేటీఆర్ అంటే యూత్ ఐకాన్ అని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కొనియాడారు.

టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయవంతంగా మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా.. ఉస్మానియా యూనివర్సిటీ రిసెర్చ్ స్కాలర్, టీఆర్ఎస్వీ రాష్ట్ర సెక్రటరీ జి.రాజేష్ నాయక్ రచించిన పుస్తకాన్ని మినిస్టర్ క్వార్టర్స్ లో మంత్రి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నేటి యువతకు ఆయన నడవడిక ఆదర్శమన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించడంలో కేటీఆర్ ది ముఖ్య పాత్ర అని తెలిపారు. ప్రపంచ నలుమూలల నుంచి పెట్టుబడులు పెట్టేందుకు కొత్త ఇండస్ట్రీలు, ఐ.టి కంపెనీలు రాష్ట్రానికి రప్పించి ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఆయన అకుంఠిత దీక్ష కండ్ల ముందు సాక్షాత్కారిస్తుందన్నారు.

ఐటీ రంగంలో కేటీఆర్ అనేక సంస్కరణలకు ఆజ్యంపోశారని, టి-హబ్ లాంటి వేదికలతో యువతలోని నైపుణ్యాన్ని వెలికితీసే స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తున్నారన్నారు.

అన్ని వర్గాల ప్రజల్లో అభిమానం చురగొన్న యువ నాయకుడు కేటీఆర్ అని మంత్రి వేముల ప్రశంసించారు.

హైదరాబాద్ మహానగరంలో ఎన్నో రోడ్లు, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ లను నిర్మించి హైదరాబాద్ నగర ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులు కేటీఆర్ తీర్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.



రిసెర్చ్ స్కాలర్ అయిన రాజేష్ నాయక్ తన అనుభవాల ద్వారా రాసిన 'నిత్య కృషీ వలుడు కె.టి.ఆర్' పుస్తకం ప్రతి ఒక్కరు చదవాలని కోరారు.

కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, పలువురు టీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధి : మంత్రి ఎర్రబెల్లి

తొర్రూరు, డిసెంబర్ 14 : ప్రణాళికాబద్ధంగా తొర్రూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేద్దాం. అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుదామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తొర్రూరు పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీ సర్వ సభ్య సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొర్రూరు వార్డుల వారీగా సమస్యలను చర్చించి పలు సమస్యలకు వెంటనే పరిష్కారాలు చూపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తొర్రూరు పట్టణం కొత్తగా అభివృద్ధి చెందుతున్న, ఇంకా బాగా అభివృద్ధి చేయగలిగిన పట్టణం అన్నారు. ఈ పట్టణాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దటానికి సరికొత్త ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. మంచి డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలను సూచించారు.

కొత్త ఇంటి నిర్మాణాలకు ప్లానింగ్ ప్రకారం పర్మిషన్లు ఇవ్వాలని, రూ.6 కోట్లతో బిటి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. కౌన్సిలర్లు వారి వారి వార్డులలో పర్యటించి, సమస్యలను పరిష్కరంచాలన్నారు.

పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ను మరింత అభివృద్ధి చేస్తాం. డ్రైనేజ్ వ్యవస్థ ను మరింత మెరుగు పరచాలి. 100 శాతం మిషన్ భగీరథ మంచినీరు తొర్రూరు ప్రజలకు నల్లాల ద్వారా అందించాలన్నారు. అధికారులు సంన్వయంతో పని చేయాలని మంత్రి సూచించారు.



సమావేశంలో..మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ శశాంక్, అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్, తొర్రూరు మున్సిపాలిటీ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, కమిషనర్ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 33 కోట్లతో 800 పడకలు

## నిలోఫర్‌లో త్వరలో అందుబాటులోకి

హైదరాబాద్, డిసెంబర్ 14:నిలోఫర్ దవాఖానలో రూ.33 కోట్లతో మరో 800 పడకలను అందుబాటులోకి తీసుకురానున్నామని, పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని వైద్యారోగ్యశాఖ మంత్రి టీ హరీశ్‌రావు చెప్పారు. నిలోఫర్ హాస్పిటల్‌లో రూ.2 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన సీటీ-స్కాన్, నియోనాటల్ స్కిల్ ల్యాబ్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిలోఫర్ దవాఖానకు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా రోగులు వస్తుంటారని ఈ నేపథ్యంలోనే రూ.33 కోట్లతో మరో 800పడకలను అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు.

ప్రస్తుతం గుండెసమస్యలు వచ్చిన చిన్నారులను చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు పంపుతున్నారని, దీనివల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నందున ప్రత్యేకంగా కార్డియాలజీ విభాగాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నామని చెప్పారు. అయితే ఈ విభాగాన్ని నిలోఫర్‌లో ఏర్పాటు చేయాలా లేక నిమ్స్‌లోనా అన్నదానిపై ఒక కమిటీని వేశామని చెప్పారు. కరోనా వైరస్ థర్డ్‌వేవ్‌ను దృష్టిలో పెట్టుకొని నిలోఫర్ హాస్పిటల్‌లో మరో సీటీ-స్కాన్‌ను అందుబాటులోకి తెచ్చామని అన్నారు. నవజాత శిశువులకు చికిత్స అందించే వైద్యసిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా నియోనాటల్ స్కిల్ ల్యాబ్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. టీ-డయాగ్నస్టిక్ సెంటర్లు అద్భుతంగా పనిచేస్తున్నాయని, మిగిలిన 13 జిల్లాల్లో కూడా వాటిని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

నిలోఫర్‌కు ఆరోగ్యశ్రీ కింద ప్రతి సంవత్సరం రూ.10కోట్లు వస్తున్నాయని, ఈ నిధులను దవాఖాన అభివృద్ధికి వినియోగించే అధికారం సూపరింటెండెంట్‌కు కల్పించామని మంత్రి తెలిపారు. నిలోఫర్‌కు ఇతర రాష్ట్రాల నుంచి రోగులు వస్తున్నందున వారికి ఆయుష్మాన్ భారత్ కింద చికిత్స అందించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి హరీశ్ చెప్పారు. కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, డీహెచ్‌లు మంగళవారం ములుగు, సిరిసిల్ల వెళు న్నారని, వారు ఇచ్చే నివేదిక ఆదారంగా త్వరలోనే హెల్త్ ప్రొఫైల్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. రాష్ట్రంలో రిస్క్ దేశాల నుంచి వచ్చిన 15మందికి పాజిటివ్ వచ్చినప్పటికీ వారిలో ఒక్కరికి కూడా ఒమిక్రాన్ పాజిటివ్ రాలేదని మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణ, డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్లు, హెచ్ఓడీలు ఓపీలో ఉండాల్సిందే

ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలందరూ ఔట్‌పేషెంట్ విభాగంలో అందుబాటులో ఉండాలని, కేవలం పీజీలు, ఎస్ఆర్‌లపై వదిలేయడం సరికాదని మంత్రి హరీశ్ స్పష్టంచేశారు. ఓపీతోపాటు వారు ఆపరేషన్లు కూడా చేయాలని, తద్వారా పీజీ, ఎస్ఆర్‌లకు మంచి శిక్షణ ఇచ్చినట్టు అవుతుందని చెప్పారు. సెల్ఫ్ అప్రైజల్ ఇవ్వాలని వైద్యులకు సూచించినట్లు తెలిపారు. నెల నెలా వాటిపై సమీక్షిస్తామన్నారు. సిబ్బందికి సంబంధించిన జీతాలు, మందుల విషయంలో ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు.

# క్యాప్సికమ్ విత్తనాలు నాటిన మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 14:రైతుల కోసం నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు యాసంగిలో ఇతర పంటలు సాగు చేయాలని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి రైతులకు సూచించారు. సోమవారం మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం పోతారం గ్రామ పర్యటనకు వెళ్లిన మంత్రి.. ఓ రైతుకు సంబంధించిన చేనులో తానే స్వయంగా క్యాప్సికమ్ విత్తనాలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రం అవలంబి స్తున్న తీరు రైతాంగాన్ని చిక్కుల్లో పడేసేలా ఉన్నదని అన్నారు. వరిని సాగు చేసి నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని చైతన్యవంతులను చేస్తున్నదని చెప్పారు.



# కోర్సుల ఎంపికలో మారిన విద్యార్థుల ఆలోచనలు.. కంప్యూటర్ సైన్స్‌కు పెరుగుతున్న డిమాండ్..

హైదరాబాద్, డిసెంబర్ 14:ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థుల ఆలోచనా ధోరణి మారుతోంది. ఏదో ఒక స్ట్రీమ్‌లో బీటెక్ పూర్తి చేసి ఉద్యోగాల కోసం ప్రయత్నించవచ్చనే అభిప్రాయం నుంచి ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉండే బ్రాంచులనే ఎంపిక చేసుకోవాలని యువత భావిస్తోంది. దీంతో కంప్యూటర్ సైన్స్‌లో మాత్రం తీవ్ర పోటీ నెలకొంటోంది. గతంలో సాఫ్ట్‌వేర్ బూమ్ ఉన్న సమయంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ)కి ఇదే తరహా డిమాండ్ ఉండేది. అయితే రెండు మూడేళ్లుగా కంప్యూర్ సైన్స్‌లో ఎక్కువ అవకాశాలు లభిస్తుండటంతో క్రేజీ కోర్సుగా మారింది. ఈ ఏడాది ఈఏపీ సెట్(ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష)లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

రాష్ట్రంలోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో మొత్తం లక్షా 12 వేల 699 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన తొలి విడత కౌన్సెలింగ్‌లో వీటిలో 80 వేల 935 సీట్లు భర్తీ అయ్యాయి. భర్తీ అయిన సీట్ల వివరాలు చూస్తే.. కంప్యూటర్ సైన్స్ కోర్సుకున్న డిమాండ్ స్పష్టమవుతుంది. ఈ డిమాండ్ దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో సీఎస్ఈ సీట్లను పెంచుకునేందుకు యాజమాన్యా లు కోరాయి. కంప్యూటర్ సైన్స్ స్ట్రీమ్‌లో మొత్తం 24 వేల 904 సీట్లుండగా.. మొదటి విడతలోనే దాదాపు 95 శాతానికిపైగా భర్తీ అయ్యాయి. సీఎస్ఈ తర్వాత డిమాండ్ ఉన్న కోర్సుల్లో ఈసీఈ, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్(ఈఈఈ), మెకానికల్ ఇంజినీరింగ్ ఉన్నాయి.

# గుండెపోటుతో పాఠశాలలోనే కుప్పకూలిన ప్రధానోపాధ్యాయుడు

నారాయణపేట,డిసెంబర్ 14: : ఓ ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో పాఠశాలలోనే కుప్పకూలిపోయాడు. కోస్గి మండలం మీర్జాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ లబిద్‌కు మంగళవారం మధ్యాహ్నం గుండెపోటు రావడంతో పాఠశాలలోనే కుప్పకూలిపోయాడు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. హుటాహుటిన ఆయనను ఆస్పత్రికి తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రధానోపాధ్యాయుడి మృతిపట్ల విద్యార్థులు, మీర్జాపూర్ వాసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

# ఏపీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి బాధ్యత ఎవరిది: ఎంపీ కనకమేడల

న్యూఢిల్లీ, డిసెంబర్ 14:ఇటీవల భారీ వరదలకు అన్నమయ్య ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయిన అంశాన్ని టీడీపీకి చెందిన ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ మంగళవారం నాడు రాజ్యసభలో లేవనెత్తారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ఆయన ప్రస్తావించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిందని ఆయన ఆరోపించారు. ఈ నిర్లక్ష్యానికి ఎవరు బాధ్యత వహించాలని ఆయన ప్రశ్నించారు.

ఏపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించినందునే ఇటీవలి వరదలకు అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిందని ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ రాజ్యసభలో ఆరోపించారు. వరదల సమయంలో ప్రాజెక్టు గేట్లు సకాలంలో తెరుచుకోకనే నష్టం సంభవించిందని, ప్రజల ప్రాణాలతో ఏపీ ప్రభుత్వం చెలగాటమాడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్వహణ లోపం కారణంగా భారీ నష్టం చోటు చేసుకున్నదని చెప్పారు. ఈ నష్టానికి బాధ్యులు ఎవరన్నది కేంద్రమే తేల్చాలని కోరారు. కేంద్రం స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో గత నెలలో కుండపోతగా కురిసిన వర్షాలకు భారీ వరదలు ముంచెత్తాయి. దాంతో అన్నమయ్య, ఫించ జలాశయాల కట్టలు తెగిపోయాయి. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోగా.. పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం సంభవించి.



# గెలుపొందిన భాను ప్రసాదరావు, రమణకు శుభాకాంక్షలు తెలియజేసిన ఏనుగు మనోహర్ రెడ్డి





రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 14(నేటినిజం ప్రతినిధి):స్థానిక సంస్థల ప్రతినిధుల కరీంనగర్ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులు భాను ప్రసాద్ రావు, ఎల్ రమణ విజయం సాధించడం పట్ల వేములవాడ టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్ రెడ్డి శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు మంగళవారం కరీంనగర్ పద్మనాయక కల్యాణ మండపంలో ఎమ్మెల్సీ లను కలిసి గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఏనుగు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంలో పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొన్న ఓటు వేసిన ఎంపీపీలు, వైస్ ఎంపీపీ లు ,జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ చైర్పర్సన్ లు కౌన్సిలర్లు లకు మనోహర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# వేములవాడ వంద పడకల ఏరియా ఆస్పత్రిలో ఎక్స్ రే సదుపాయం ఏర్పాటు చేయండి



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 14(నేటినిజం ప్రతినిధి):వేములవాడ నియోజకవర్గం వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పా పురం లో ఏర్పడిన వంద పడకల ఏరియా ఆస్పత్రిలో ఎక్స్ ర సదుపాయం లేనందున వెంటనే ఏర్పాటు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నాగుల విష్ణుప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు ఏరియా ఆసుపత్రిలో సదుపాయాలు లేనందున పేషెంట్లుకు 500 రూపాయల అదనంగా భారం పడుతుంది అని అన్నారు . ఎక్స్ ర లేనందున ప్రవేట్ హాస్పిటల్ కి వెళ్లి తీసుకోవాల్సి వస్తుంది రోగులకు అదనంగా భారం పడుతుంది ఆవేదన వ్యక్తం చేశారు రోగుల పక్షాన వేములవాడ ప్రభుత్వ ఏరియా వంద పడకల ఏరియా ఆసుపత్రిలో డిజిటల్ ఎక్స్ ర సదుపాయంకల్పించవలసిందిగా ప్రజల పక్షాన విన్నవించుకున్నారు .

# పార్లమెంటు సాక్షిగా ప్రజాస్వామ్యం కూనీ: రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 14:కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వ తీరుపై మరోసారి మండిపడ్డారు. కేంద్రం విపక్షాల ఆందోళనల మధ్యే బిల్లుల మీద బిల్లులను ఆమోదించుకుంటున్నదని, ఇది మంచిపద్ధతి కాదని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పార్లమెంటుకు రావడంలేదని, జాతీయ ప్రాముఖ్యత ఉన్న అంశాలపై ప్రభుత్వం ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశమే ఇవ్వడంలేదని ఆయన ఆరోపించారు. పార్లమెంటు సాక్షిగా ప్రజాస్వామ్యం కూనీ అవుతుండటం దురదృష్టకరమన్నారు.ప్రశ్నించిన 12 మంది ఎంపీలపై సస్పెన్షన్ విధించడం అనేది ప్రభుత్వం దేశ ప్రజల గొంతు నొక్కుతుం దనడానికి సంకేతమని రాహుల్‌గాంధీ విమర్శించారు. రాజ్యసభలో 12 మంది ఎంపీల గొంతు నొక్కేశారు, వాళ్లు ఏం తప్పు చేశారు..? అని ఆయన ప్రశ్నించారు. ఆ ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేసే వరకు తాము సభలో ఎలాంటి చర్చ జరుగనీయమని హెచ్చరించారు. అదేవిధంగా లఖింపూర్ ఖేరీ ఘటనను కూడా ఆయన ప్రస్తావించారు.లఖింపూర్ ఖేరీలో ఓ మంత్రి రైతులను చంపేశాడు. ఈ విషయం ప్రధాన మంత్రికి కూడా తెలుసు. కానీ నిందితులపై చర్యలు ఉండవు. ఎందుకంటే దేశంపై అధికారం ఇద్దరు ముగ్గురు పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. రాజ్యసభలో ఎంపీల సస్పెండ్ చేసింది చైర్మనో, ప్రధానమంత్రో కాదు.. రైతుల ఆదాయం దోచుకోవాలని చూస్తున్న పెట్టుబడిదారులే అని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు.

# దేశంలో ప్రాంతీయ పార్టీలదే హవా : వినోద్ కుమార్

హైదరాబాద్, డిసెంబర్ 14: దేశంలో ప్రాంతీయ పార్టీలు చాలా బలంగా ఉన్నాయి. బీజేపీ దేశంలోని అన్ని రాష్ట్రాలకు విస్తరించలేదు. బీజేపీ ప్రాంతీయ పార్టీలపై దాడి చేయాలని ప్రయత్నం చేస్తోందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ ధ్వజమెత్తారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ వెంకటేష్ నేత, మాజీ మంత్రి పెద్ది రెడ్డితో కలిసి తెలంగాణ భవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రాకముందే మాపై కొందరు దుష్ప్రచారం మొదలు పెట్టారు. ఆ దుష్ప్రచారం ఫలితాల తర్వాత కూడా కొనసాగుతోందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కరీంనగర్ లో అభ్యర్థి పెట్టకుండానే ఇండిపెండెంట్ అభ్యర్థికి మద్దతు తెలిపాయి. కరీంనగర్ రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక స్థానంలో టీఆర్ఎస్ గెలువదని దుష్ప్రచారం చేశాయని మండిపడ్డారు.

ఈ దేశం బీజేపీ చేతిలో పూర్తిగా ఉంటే విచ్చిన్నం అవుతుందన్నారు. దేశంలో మహిళలను బీజేపీ కించపరుస్తోందని మండిపడ్డారు. నెహ్రూ దేశానికి గట్టి పునాది వేశారు. ఆయన పేరు లేకుండా తీసివేశారు. కాంగ్రెస్ దద్దమ్మలు బీజేపీని ఎదురుకోవడంలో విఫలం అయ్యారు.

కాంగ్రెస్ నేతలకు రాహుల్ గాంధీ పేరును గుర్తు పెట్టుకోవడం తప్ప చరిత్రను మరిచిపోతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ మహిళల పట్ల వ్యతిరేకత పెంచడానికి సిగ్గు ఉండాలిని ఘాటుగా విమర్శించారు. అబాఇ పరీక్ష లో వివాస్పద ప్రశ్న పత్రం తయారు చేసిన వాళ్ళను వెంటనే తొలగించాలన్నారు. శాసనమండలిలో 18 ఎన్నికలు జరిగితే అన్నింట్లో టీఆర్ఎస్ గెలిచిందన్నారు.


ఆహ్వానము

కేతవరపు ఫౌండేషన్

జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్

ప్రపంచ రికార్డులు నెలకొల్పిన శ్రీ త్యాగరాయ గానసభ

భారత్ భాషాభూషణ్ డా॥ కేతవరపు రాజ్యశ్రీ గారు రచించిన "మార్నింగ్ కాఫీ" కథా సంపుటి ఆవిష్కరణ మరియు శ్రీ బైస దేవదాసు, నేటినిజం పత్రిక సంపాదకులు గారికి అంకితోత్సవం

ముఖ్య అతిథి : డా॥ కె.వి. రమణ, ఐ.ఎ.ఎస్ (రి)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు

సభాధ్యక్షులు : డా॥ ముక్తేవి భారతి
ప్రఖ్యాత రచయిత్రి

విశిష్ట అతిధి : శ్రీ కళా వి.ఎస్. జనార్ధనమూర్తి
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ

కృతి స్వీకర్త : శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటినిజం

పుస్తక సమీక్ష : శ్రీ పెద్దూరి వెంకటదాసు, కథా రచయిత

స్పందన : డా॥ కేతవరపు రాజ్యశ్రీ

సాంస్కృతిక కార్యక్రమం

శ్రీ శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమి స్థాపకురాలు సంగీత గురువు శ్రీమతి చిల్లా శివపార్వతి శిష్య బృందంచే లలిత సంగీత విభావరి మరియు కుమారి కె. సాయి అరుణాంజలి చే కూచిపూడి నృత్యం

తేది: 16-12-2021, గురువారం, సాయంత్రం 5.30 గంటలకు
కళా సుబ్బారావు కళావేదిక (శ్రీ త్యాగరాయ గానసభ) చిక్కడపల్లి, హైదరాబాద్.

కె. మాధవ రావు
అధ్యక్షులు, కేతవరపు ఫౌండేషన్

గుదిబండి వెంకటరెడ్డి, చైర్మన్
జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్

శ్రీమతి కళా శారదా దీక్షితులు
ప్రధాన కార్యదర్శి, శ్రీ త్యాగరాయ గానసభ


# క్యాథలగ్ ల్యాబ్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 14: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీకర హాస్పిటల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాథలగ్ ల్యాబ్ ని ఈ రోజు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్యఅతిధిగా కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్ తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ క్రిష్ణం రెడ్డి, డాక్టర్ వికాస్, డాక్టర్ అఖిల్ గాడి, డాక్టర్ హరికిరణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రట్లవత్ గంగయ్య, కౌన్సిలర్ సువర్ణ, నాయకులు తెల్లా వినోద్, సన్నా రాజు, సాయి, చందు, తదితరులు పాల్గొన్నారు.

# అలిపిరిలో ముగిసిన అమరావతి రైతుల మహా పాదయాత్ర

అమరావతి, డిసెంబర్ 14:అమరావతినే రాజధానిగా కొనసాగించాలంటూ రైతులు చేపట్టిన మహా పాదయాత్ర నేటితో ముగిసింది. అలిపిరిలోని శ్రీవారి పాదాల చెంతకు ఈ యాత్ర చేరగానే యాత్రకు సంబంధించిన ప్రతినిధులు కొబ్బరి కాయలు కొట్టి యాత్రకు ముగింపు పలికారు. ఈ సమయంలో రైతులు జై అమరావతి? జైజై అమరావతి.. అంటూ నినాదాలు చేయడంతో అలిపిరి ప్రాంతమంతా అమరావతి నినాదాలతో హోరెత్తింది. మరోవైపు బుధవారం నుంచి మూడు రోజుల పాటు ప్రతి రోజూ 500 మంది రైతులకు శ్రీవారి దర్శనం భాగ్యం కలిగించాలని టీటీడీ నిర్ణయించుకుంది. ఈ మేరకు తగిన ఏర్పాట్లను కూడా పూర్తి చేసింది. మరోవైపు అమరావతే రాజధానిగా ఉండాలన్న తమ ఆకాంక్ష వ్యక్తమయ్యేలా ఈ నెల 17న తిరుపతి వేదికగా ఓ భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని ప్రతినిధులు ప్రకటించారు.

'న్యాయస్థానం టు దేవస్థానం' పేరుతో నవంబర్ 1 నుంచి రైతులు తుళ్లూరు నుంచి ఈ మహా పాదయాత్రను చేపట్టారు. 44 రోజుల పాటు ఈ యాత్ర సాగింది. గుంటూరు, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల గుండా ఈ యాత్ర సాగింది. 45 వ రోజు అలిపిరిశ్రీనివాసుడి పాదాల చెంత ఈ మహా పాదయాత్రను రైతులు ముగించారు.

# కె. గౌదమాన్ సంస్థకు రెక్కలు తొడిగిన ఎంఎస్ఎంఈ అంతర్జాతీయ సహకార పథకం

న్యూఢిల్లీ, డిసెంబర్ 14:తన దేశ అభివృద్ధికి కట్టుబడి, ఒక వ్యవస్థాపకుడు కావాలనే స్ఫూర్తితో శ్రీ కె. గౌడమాన్ బ్రిటన్ నుండి చెన్నైకి వలస వచ్చారు. ఆయన ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేట్ అయినప్పటికీ, పారిశ్రామికవేత్తగా మారే అతని ప్రయాణం అంత సులభం కాదు. ప్రారంభ దశ సమయం అతనికి చాలా ఉద్వేగభరితంగాను, కష్టంగాను నిలిచింది. ఎందుకంటే తన వ్యాపారానికి నిధులను ఏర్పాటు చేయడానికి అతను తన తల్లి ఆభరణాలను తనఖా పెట్టవలసి వచ్చింది. ఈ రోజు అతను స్థాపించిన సంస్థ సీజెడ్ స్మార్ట్ మొబిలిటీ సొల్యూషన్స్ పార్కింగ్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్‌లను అందిస్తోంది. ఆయనకు అంతర్జాతీయ సహకార పథకం రూపంలో ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ నుండి మద్దతు లభించింది, ఇది అతని వ్యాపారాన్ని కొత్త స్థాయికి తీసుకువెళ్లింది. "నేను ఎంఎస్ఎంఈ/ఎన్‌సీఐసీ గుడుకు కిందకు వెళ్లాను. మీరు మీ సంస్థను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం కల్పించాలనుకుంటే మీరు అంతర్జాతీయ సహకార పథకాన్ని ఉపయోగించుకోవచ్చు" అని శ్రీ గౌధమాన్ సూచిస్తాడు. నేడు సీజెడ్ స్మార్ట్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన బ్రాండ్‌గా ఎదిగింది.

# రిస్క్ దేశాల నుంచి వచ్చే వారికి.. ఆర్టీ పీసీఆర్ టెస్ట్‌కు అడ్వాన్స్ బుకింగ్ తప్పనిసరి : కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: ప్రపంచాన్ని వణికిస్తున్న ఒమిక్రాన్ ముప్పును దృష్టిలో పెట్టుకొని రిస్క్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు ఆర్టీ పీసీఆర్ పరీక్షల కోసం అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవడాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది.

ముందుస్తుగా బుక్ చేసుకోని వారికి సైతం విమానంలోకి ఎక్కేందుకు అనుమతించనున్నారు. అయితే, అలాంటి ప్రయాణికులకు పరీక్షలు చేసేందుకు ముందస్తుగా స్లాట్ బుక్ చేయడం సంబంధిత విమానయాన సంస్థలదే బాధ్యతని స్పష్టం చేసింది.

ఇప్పటికే యుూకే ఇలాంటి మార్గదర్శకాలను అమలు చేస్తున్నది. ఈ నిబంధనతో దేశానికి వచ్చే ప్రయాణికులంతా ఆర్టీ పీసీఆర్ పరీక్షల కోసం ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉండగా.. నిబంధనలు పాటించడంలో విఫలమైతే బ్రిటీష్ విమానాశ్రయానికి విమానంలో ఎక్కేందుకు అనుమతించడం లేదు. ఈ నిబంధనలు భారత్‌లో ఈ నెల 20 నుంచి అమలులోకి రానున్నది. తొలి దశలో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లోని విమానాశ్రయాలకు వచ్చే అంతర్జాతీయ ప్రయాణికులకు మాత్రమే వర్తించనున్నది.

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ జారీ చేసిన మెమోలో ప్రయాణికులు 'రిస్క్‌లో ఉన్న' దేశాల నుంచి వచ్చినట్లయితే తప్పనిసరిగా ఆర్టీ పీసీఆర్ పరీక్ష చేసుకునేందుకు ముందస్తుగా బుక్ చేసుకునేందుకు అనుమతించేలా ఎయిర్ సువిధ పోర్టల్‌లో మార్పులు చేయనున్నట్లు తెలిపింది. ముందస్తు బుకింగ్, చెల్లింపుల మొదలైన దాంట్లో ఎలాంటి సమస్య లేకుండా చూసేందుకు మొదట ఆరు నగరాల్లో అమలు చేస్తున్నట్లు పేర్కొంది.

ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకారం.. రిస్క్ దేశాల జాబితాల్లో దక్షిణాఫ్రికా, బ్రెజిల్, బోట్స్‌వానా, చైనా, ఘనా, మారిషస్, న్యూజిలాండ్, జింబాబ్వే, టాంజానియా, హాంకాంగ్, ఇజ్రాయెల్, యూకే సహా యూరిపియన్ దేశాలున్నాయి. ఇదిలా ఉండగా విమానం ఎక్కే ముందు తమ ప్రయాణికులు తప్పనిసరిగా ముందస్తు బుకింగ్‌ను తనిఖీ చేయాలని విమానయాన సంస్థలకు డీజీసీఏ సూచించింది.

# దివ్యాంగులకు ప్రతిభా పురస్కారాలు అందజేసిన మంత్రి ఎర్రబెల్లి



వరంగల్, డిసెంబర్ 14:: దివ్యాంగుల సంక్షేమానికి ఎర్రబెల్లి ట్రస్ట్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయపర్తి ఎంపిడిఓ కార్యాలయంలో దివ్యాంగుల వారోత్సవాలు-ప్రతిభావంతుల పురస్కార ఉత్సవం కార్యక్రమాన్ని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్, తెలంగాణ వికలాంగుల సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి, పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఈ రోజు నా చేత కేక్ కట్ చేయించి, ప్రతిభావంతులైన దివ్యాంగులకు సత్కారం చేయించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సంఘం దివ్యాంగుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు. ఈమధ్యే ఎర్రబెల్లి ట్రస్ట్ నుంచి 5 మోటర్ ట్రై సైకిల్స్ అందజేశాం. రాయపర్తి మండలంలో ఒక్కో గ్రామం నుంచి అర్హులైన కనీసం ఒక్కరికైనా ట్రై మోటర్ సైకిల్ అందజేస్తామన్నారు. అర్హులైన దివ్యాంగులందరికీ ఏదో ఒక సహాయం తప్పకుండా అందుతుందని మంత్రి భరోసానిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, దివ్యాంగులు పాల్గొన్నారు

# ఉస్మానియాలో 50 పడకల ఐసీయూ : మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, డిసెంబర్ 14:ఉస్మానియా ఆస్పత్రిలో 50 పడకల ఐసీయూ నిర్మాణంలో ఉందని, దీన్ని రెండు నెలల్లోనే ప్రారంభిస్తామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఉస్మానియాలో సీటీ స్కాన్, క్యాథ్ ల్యాబ్‌ను ప్రారంభించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రూ. 7 కోట్లతో క్యాథ్ ల్యాబ్, రూ.2 కోట్ల 12 లక్షలతో సీటీ స్కాన్‌ను ప్రారంభించాం అని తెలిపారు. ఉస్మానియాలో రెండు సీటీ స్కాన్స్ ఉన్నప్పటికీ ఒకటి పని చేయడం లేదు. ఒకటి మాత్రమే పని చేస్తోంది. మూడో సీటీ స్కాన్‌ను ఇవాళ రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చాం. ఫెయిల్ అయిన సీటీ స్కాన్‌ను త్వరలోనే ఉపయోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. దీంతో రోగులకు వైద్య సేవలు త్వరితగతిన అందనున్నాయి.

ఉస్మానియాలో ఉన్న 180 వెంటిలేటర్లలో 102 వెంటిలేటర్లు మాత్రమే పని చేస్తున్నాయి. మిగతా వాటికి మరమ్మతు చేయాలని ఆదేశించాం. ఉస్మానియాలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ ఆస్పత్రిలో అత్యాధునిక సదుపాయాలతో కొత్త మార్చురీని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఇందుకు రూ. 5 కోట్లు మంజూరు చేయాలని ఆదేశించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మార్చురీలను ఆధునికరిస్తున్నాం అని స్పష్టం చేశారు. జనవరి1న మళ్ళీ ఉస్మానియాలో పర్యటిస్తాను అని హరీశ్‌రావు చెప్పారు. ఉస్మానియాలో ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలు పెంచాలి. ఉస్మానియాకు ఎన్ఏబీసీ అక్రిడిటేషన్ కోసం కేంద్రానికి ప్రతిపాదన పంపుతామన్నారు. ఉస్మానియా నూతన బిల్డింగ్‌పై కోర్టు కేసు తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఖమ్మంలో వారం పదిరోజుల్లో క్యాథ్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని హరీశ్‌రావు తెలిపారు. ఆదిలాబాద్ రిమ్స్, గాంధీ ఆస్పత్రిలో, వరంగల్‌లో కూడా క్యాథ్ ల్యాబ్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. గుండె జబ్బు రోగులకు ప్రభుత్వ రంగంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో ఎల్&టీ ఇన్ఫోటెక్ న్యూ డెలివరీ సెంటర్!



హైదరాబాద్, డిసెంబర్ 14:ఎల్ & టీ.. ఇన్‌ఫ్రా నుంచి టెక్నాలజీ రంగం వరకు సేవలందిస్తున్న సంస్థ. ఎల్‌డటీ అనుబంధ టెక్నాలజీ కన్సల్టింగ్ అండ్ డిజిటల్ సొల్యూషన్స్ సంస్థ ఎల్‌డ టీ ఇన్ఫోటెక్ (ఎల్టీఐ).. హైదరాబాద్‌లో తన సేవలను విస్తరించాలని నిర్ణయించింది. ఇందుకోసం హైదరాబాద్‌లో న్యూ డెలివరీ సెంటర్ ఏర్పాటు చేసింది. 1.10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్.. తన గ్లోబల్ క్లయింట్లకు డిజిటల్, డేటా, క్లౌడ్ సేవలందించడంపై దృష్టి సారిస్తుంది. మూడు వేల మందికి పైగా ఉద్యోగులు ఈ సెంటర్‌లో పని చేస్తుంటారు. సంస్థ అంతర్జాతీయ ఆపరేషన్ల నిర్వహణలో ఎల్ అండ్ టీకి మద్దతుగా నిలుస్తున్నారు. ఈ సెంటర్‌నుఎల్టీఐ సీవోవో-ఎగ్జిక్యూటివ్‌బోర్డు సభ్యుడు నాచికెట్ దేశ్‌పాండేతో కలిసి రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి ప్రారంభించారు.

ఎల్‌డటీ ఇన్ఫోటెక్ డెలివరీ సెంటర్‌లో ఉద్యోగులందరి సేఫ్టీ, సెక్యూరిటీకి అత్యాధునిక వసతులు కల్పించారు. మాదాపూర్‌లోని హైటెక్ సిటీ మెయిన్‌రోడ్డుపై గల స్కైవ్యూ క్యాంపస్‌లో ఈ ఎల్‌డటీ ఇన్ఫోటెక్ డెలివరీ కేంద్రం ఏర్పాటైంది. దీనికి యుూఎస్‌జీబీఎస్ ఎల్ఈఈడీ గోల్డ్ సర్టిఫికేషన్ లభించింది. టెక్నాలజీ సొల్యూషన్ ప్రొవైడర్లకు,

ప్రతిభావంతులకు కేంద్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీరామారావు పంపిన సందేశంలో పేర్కొన్నారు. సులభతర వాణిజ్యానికి పెద్దపీట వేస్తున్నందునే ఎల్‌డటీ ఇన్ఫోటెక్ వంటి గ్లోబల్ కార్పొరేషన్‌లు రాష్ట్రానికి తరలి వస్తున్నాయని తెలిపారు. నూతన డెలివరీ కేంద్రం ప్రారంభించిన ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్ భవిష్యత్‌లో మరిన్ని మైలురాళ్ళ అధిగమించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎల్‌డటీ ఇన్‌ఫోటెక్ సీవోవో-ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడు నాచికెట్ దేశ్‌పాండే ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ మద్దతు, ప్రోత్సాహం, విస్తారమైన ప్రతిభావంతుల నిధితో అంతర్జాతీయ టెక్నాలజీ రంగంలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. తమ సంస్థ పురోగతి ఆకాంక్షల్లో న్యూ సిటీ డెలివరీ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ రెడీనెస్‌పై రీసెర్చ్ కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో ఎల్‌టీఐ ఎంవోయూ కుదుర్చుకున్నది.

# టిటికె ప్రెస్టీజ్ వెట్ గ్రైండర్ మార్కెట్లోకి



హైదరాబాద్, డిసెంబర్ 14:ప్రతీ ఒక్క ఇంటిలోని వంటింటిలో తప్పనిసరిగా చేరవలసిన సాధనం వెట్ గ్రైండర్. చక్కని కరకరలాడే దోశలు, మృదువైన ఇడ్లీలు లేదా మెత్తని వడలు ఏవి కావాలన్నా వాటికి అవసరమైన చక్కని పిండి తయారుచేయగల విధంగా ఈ వెట్ గ్రైండర్ డిజైన్ చేశారు. ఇళ్లలో గ్రైండిగ్ ఇబ్బందులు తొలగించి ఎలాంటి శ్రమ లేకుండా ఈ ప్రక్రియ అంతా పూర్తి చేసుకునేందుకు టిటికె ప్రెస్టీజ్ కంపెనీ తమ వెట్ గ్రైండర్ల రేంజికి టైమర్ అమర్చిన అన్వేషణాత్మకమైన పిడబ్ల్యుజి 09 వెట్ గ్రైండర్ ని జోడించింది. మీరు అద్భుతమైన పనితీరు, కాంపాక్ట్ డిజైన్ తో కూడిన వెట్ గ్రైండర్ కోసం ఎదురు చూస్తున్నట్టయితే మీకు సరిగ్గా సరిపోతుంది పిడబ్ల్యుజి 09 వెట్ గ్రైండర్. దీనిలో అత్యంత ఇన్నోవేటివ్ ఫీచర్ 90 నిముషాల వరకు టైమ్ సెట్ చేసుకునేందుకు ఉపయోగపడే డిజిటల్ టైమర్. అంటే ఇంట్లో వంట వండే వారు ఇక ఏ మాత్రం గ్రైండింగ్ ప్రక్రియను ప్రత్యేకంగా పర్యవేక్షించుకోవాల్సిన అవసరం లేదు. టైమర్ లో పెట్టిన కాలపరిమితి పూర్తవగానే గ్రైండర్ దానికదే ఆగిపోతుంది. ఎక్కడకి కావాలంటే అక్కడకి తేలిగ్గా తీసుకుపోగల, తక్కువ ప్రదేశాన్ని ఆక్రమించే కాంపాక్ట్ టేబుల్ టాప్ డిజైన్ గల వెట్ గ్రైండర్ పిడబ్ల్యుజి 09. దీని వల్ల వెట్ గ్రైండర్ ఎక్కడైనా తేలిగ్గా ఉపయోగించుకోవచ్చు. దీనికి అత్యున్నత నాణ్యతతో కూడిన సహజసిద్ధమైన గ్రైండింగ్ స్టోన్స్ అమర్చారు. ఇవి పిండిని చక్కగా రుబ్బి పెడతాయి. ప్రకృతి సిద్ధమైన రాళ్ల వల్ల పిండిలో సహజసిద్ధమైన కమ్మదనం రుబ్బురోళ్ల తరహాలోనే చెక్కు చెదరకుండా ఉంటుంది. దీనికి అమర్చిన స్టెయిన్ లెస్ స్టీల్ దీర్ఘకాల మనుగడ కలిగి తేలిగ్గా శుభ్రం చేసుకునేలా ఉంటుంది. దీనికి గల 200 డబ్ల్యు మోటార్ మీ గ్రైండింగ్ అవసరాలన్నింటికీ చక్కగా సరిపోతుంది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.